



సత్తుపల్లిలో రోగుల పడిగాపులు

'సర్కారు'కు నిర్లక్ష్యపు రోగం

ఆంధ్రజ్యోతి విజిట్

పేదలకు ఉచిత వైద్యం అందించడమే తమ లక్ష్యమని అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం చెబుతూనే ఉంటుంది. కానీ ఆ మాటలన్నీ నీటి మూటలుగానే మిగులుతున్నాయి. కొత్త భవనాలు, సరికొత్త పరికరాలున్నా పేదలకు వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియని వైద్యులు.. రోగులకు సేవలందించే వైద్య సిబ్బంది, మందుల కొరత పేదలకు శాపంగా మారుతోంది. జిల్లాలో పేదల వైద్యం అందించేందుకు ప్రభుత్వం భవనాలు, సౌకర్యాలు, డాక్టర్లను ఏర్పాటు చేస్తున్నా ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రైవేటు వైద్యంపై మోజు పెరుగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల పరిస్థితి ని చూసి ఆసుపత్రికి వచ్చిన రోగులు ప్రైవేట్ బాట పడుతున్నారు. దీంతో ప్రైవేటు వైద్యం జిల్లాలో మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది.

- ప్రభుత్వాసుపత్రుల్లో సమయం పాటించని వైద్యులు
- బయోమెట్రిక్ ఉన్నా నామమంత్రంగానే హాజరు
- అనేక ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది, మందుల కొరత
- అసౌకర్యాలతో రోగులకు తీవ్ర అవస్థలు
- 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెలుగు చూసిన వాస్తవాలు

ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/సత్తుపల్లి/మధిర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం ఖమ్మంతో పాటు ఉమ్మడిజిల్లాలో ప్రైవేటు వైద్యశాలలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై బుధవారం నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో అనేక వాస్తవాలు బహిర్గతమయ్యాయి. ఏ ఆసుపత్రిని సందర్శించినా రోగుల కష్టాలు, ఆసుపత్రుల్లో నిర్లక్ష్యపు జబ్బు స్పష్టంగా తెలుస్తోంది.

ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో..

ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ పర్యవేక్షణలో ఉన్న ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలు రోగులు ఆశించిన స్థాయిలో అందడం లేదు. ఖమ్మంతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా భారీ సంఖ్యలో రోగులు ఇక్కడి వస్తున్నా ఉదయం 9గంటలకు రావాల్సిన వైద్యులు 10గంటలకు వస్తున్నారు. అన్ని విభాగాల్లోనూ హెచ్‌వోడీలతో పాటు ఇతర సిబ్బంది సమయం పాటించడంలేదు. బయోమెట్రిక్ హాజరు ఉన్నా దాన్ని కచ్చితంగా అమలు చేయకపోవడంతో డాక్టర్లు, సిబ్బంది ఇష్టారాజ్యంగా ఆసుపత్రికి వస్తున్నారు. ఈ ఆసుపత్రిలో 125మంది వైద్యులకుగాను 65మంది ఉన్నారు. వారిలో 40మంది పూర్తిస్థాయిలో ఉండగా మిగిలినవారు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలో కూడా పలురకాల మందుల కొరత నెలకొంది. దాంతో రోగులు ప్రైవేటు మెడికల్ షాపులకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. అల్పాహారానికి ముందు రోగులకు షుగర్ టెస్టు చేయాల్సి ఉన్నా ల్యాబు సిబ్బంది ఉదయం అందుబాటులో ఉండడం లేదు. జనరల్ మెడిసిన్‌తో పాటు అన్ని విభాగాల్లోనూ వైద్యుల కొరతతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. ఈ ఆసుపత్రిలో ప్రభుత్వం సిటీస్కాన్ ఏర్పాటు చేసినా అది తరుచూ మరమ్మతులకు గురవుతోంది. ఎంఆర్‌ఐ ఏర్పాటుకు ప్రతిపాదన ఉన్నా నిధుల కొరత కారణంగా ఈ ఆసుపత్రిలో ఏర్పాటు చేయకపోవడంతో రోగులు ప్రైవేటు సెంటర్లకు వెళ్లి వేల రూపాయలు చెల్లించి పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇక రాత్రివేళ డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. ఈ నేపథ్యంలో ఖమ్మం ఆసుపత్రికి వస్తే డాక్టర్లు ఉండరు, ఉన్నా సరిగ్గా చూడరనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మధిరలో వైద్యుల కొరత..

మధిర ఆసుపత్రిని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌నుంచి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడ 30 మంది వైద్యులకు గాను 13మంది పనిచేస్తున్నారు. వీరిలో ఇద్దరు డిప్యుటేషన్‌పై వేరేచోట పనిచేస్తున్నారు. మిగిలిన 11మందిలో ఖమ్మం నుంచి (మిగతా 6వ పేజీలో)

సత్తుపల్లిలోనూ వైద్యుల కొరత..

సత్తుపల్లి ఏరియా ఆసుతిప్రలో వైద్యుల కొరత ఉంది. 40మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా 9మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి వంద పడకల భవనం నిర్మాణంలో ఉంది. ఇంకా అది పూర్తికావడంలేదు. కాంట్రాక్టర్ నిర్మాణ పనుల్లో అలసత్వం చూపుతున్నారు. దీంతో రోగులకు అసౌకర్యాలు నెలకొన్నాయి. మందుల కొరతతోపాట రోగులకు సరైన వైద్యసేవలందడంలేదు. రాష్ట్ర సరిహద్దున ఉన్న సత్తుపల్లి ప్రాంతంలో పొరుగు రాష్ట్రం నుంచి కూడా రోగులు వైద్యం కోసం రావడం జరుగుతుంది. ప్రబుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు.

ఈ జబ్బుకు మందేది?


ఖమ్మంలో

'ఓపీ'కకు పరీక్ష

- ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో పర్యవేక్షణ కరవు
- ఉండాల్సిన వైద్యులు 125మంది.. ఉన్నది 65మందే
- సమయం పాటించని వైద్యులు, సిబ్బంది

7


ఏపీలోని యటపాక గ్రామం

గవర్నర్ సారూ.. మా గోడు వినరూ !


- ఆ ఐదు పంచాయతీలతోనే భద్రాద్రికి భవిష్యత్తు
- వినతులు, చర్చలకే పరిమితమైన ప్రధాన సమస్య
- గవర్నర్ పర్యటన నేపథ్యంలో మరోసారి తెరపైకి విలీన సమస్య

భద్రాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ పరిధిలోకి వెళ్లిన ఆ ఐదు పంచాయతీలు భద్రాచలంలో విలీనం చేయాలని ఇరు ప్రాంతవాసులు కోరుతున్నా ఆ డిమాండ్ పరిష్కారానికి నోచుకోవడం లేదు. రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి వచ్చిన సమయంలోనూ ఆ ఐదు పంచాయతీల అంశం తెరపైకి రావడం, చర్చకు దారి తీయడం, వినతులు సమర్పించడంతోనే సరిపోతోంది. కానీ సమస్యకు శాశ్వత పరిష్కారమే లభించడం లేదని సరిహద్దు ప్రాంతవాసులు ఆవేదన చెందుతున్నారు. యటపాక, గుండాల, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, కన్నాయిగూడెం పంచాయతీలను భద్రాద్రిలో విలీనం చేయాలని ఆ ప్రాంతవాసులు ఇప్పటికే పలుమార్లు రాష్ట్రపతి, గవర్నర్, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విన్నవించారు. అయినా స్థానికుల మనోభీష్టాన్ని పాలకులు గుర్తించకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తొలిసారిగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకునేందుకు వస్తున్న క్రమంలో గురువారం రాత్రికే ఆయన బూర్గంపాడు మండలంలోని సారపాక ఐటీసీ అతిథిగృహానికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మరోసారి ఐదు పంచాయతీల విలీనం డిమాండ్ తెరపైకి రావడమే కాకుండా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ విషయంపై సానుకూలంగా స్పందిస్తారనే ఆశతో రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దువాసులు ఆకాంక్షిస్తున్నారు.

ఆ ఐదుతోనే ఊపిరి..

ఏపీ పరిధిలోకి వెళ్లిన ఆ ఐదు పంచాయతీలు తెలంగాణలో విలీనం చేస్తేనే భద్రాచలానికి ఊపిరి పోసినట్లవుతుందన్న వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రత్యేక పరిస్థితుల్లో పోలవరం ముంపు పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీ పరిధిలో విలీనం చేశారు. అలా విలీనమైనవాటిలో కూనవరం, చింతూరు, వరరామచంద్రాపురం, కుక్కునూరు, వేలేరుపాడు, బూర్గంపాడులోని పలు గ్రామాలతో పాటు భద్రాచలం మండలంతో సహా (గ్రామ పంచాయతీ మినహాయించి) ఏపీ పరిధిలో విలీనమయ్యాయి. దీంతో రాష్ట్రంలో నాడు జిల్లాగా ఆవిర్భవించాల్సిన భద్రాచలం గ్రామ పంచాయతీకే పరిమితమైందనే ఆవేదన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. అంతేకాకుండా (మిగతా 6వ పేజీలో)

నేడు సారపాకకు గవర్నర్ జిష్ణుదేవ్



బూర్గంపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శుక్రవారం పర్యటించనున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం రాత్రికి భద్రాద్రి జిల్లా సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేసి శుక్రవారం ఉదయం భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఇరుజిల్లాల కలెక్టరేట్లలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు.



28 వరకు మున్నేరు బాధితులకు వందశాతం పరిహారం

- ఇప్పటికే 9,279 కుటుంబాలకు రూ.15.31కోట్ల పంపిణీ
- కేఎంసీ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు

ప్రశ్న: మున్నేరు వరదల బాధితుల గుర్తింపు ఎలా చేశారు ?

జవాబు: సెప్టెంబరు 1న కురిసిన వర్షానికి మున్నేరుకు వరద పోటు రావటంతో పరివాహక ప్రాంతాల ప్రజలు ముంపునకు గురయ్యారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశాల మేరకు వెంటనే సర్వే చేశాం. ఐదు విభాగాలకు బాధితులను గుర్తించాం.

ప్ర: ఎంత మంది బాధితులకు పరిహారం పంపిణీ చేశారు ?

జ: తొలి విడతలో నిర్వహించిన సర్వేలో 9,279మంది బాధిత కుటుంబాలకు రూ.15,31,03,350లను ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలకు జమ చేశాం. లబ్ధిదారుల జాబితాలకు బ్యాంకు ఖాతాల నెంబర్లు కొన్ని సాంకేతిక కారణాలతో ఇంకా 273 మంది బాధిత కుటుంబాలకు పరిహారం అందాల్సి ఉంది. వారికి 28లోగా పరిహారం నూరు శాతం పరిహారం అందేలా కమిషనర్ అభిషేక్ ఆగస్త్య బ్యాంకర్లతో మాట్లాడారు.

ప్ర: పరిహారం పంపిణీలో బ్యాంకర్ల నుంచి ఇబ్బందులున్నాయా ?

జ: లబ్ధిదారులకు పరిహారం పంపిణీలో ప్రభుత్వ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న లబ్ధిదారులుకు ఇబ్బంది కలగలేదు. ప్రైవేట్ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు కలిగిన లబ్ధిదారులకు పరిహారం అందటంలో జాప్యం జరిగింది. ఈ మేరకు లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో పలుమార్లు సమీక్షించి పర్యవేక్షణ చేస్తున్నాం.

ప్ర: పరిహారం కోసం ఇంకా వచ్చే దరఖాస్తులపై ఏం చేయబోతున్నారు ?

జ: మొదటి విడతలో రెవెన్యూ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సర్వే చేసి బాధితులను గుర్తించాయి. వారికి పరిహారం పంపిణీ ప్రక్రియ ముగింపునకు వచ్చింది. పరిహారం అందలేదని కేఎంసీ కార్యాలయానికి మరో 3వేల దరఖాస్తులు వచ్చాయి. వాటిని రెండు బృందాలతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నాం.

ఇప్పటికే 1,343 కుటుంబాల సర్వే పూర్తి చేశాం. పూర్తి స్థాయిలో రెండో విడత సర్వే అనంతరం నిజమైన బాధితులుకు పరిహారం అందించేందుకు ప్రభుత్వానికి నివేదిస్తాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం సంక్షేమవిభాగం

విదేశాల్లో ఇద్దరు మంత్రులు

- ఆయిల్‌పామ్ అభివృద్ధిపై అధ్యయనానికి మలేషియా వెళ్లిన తుమ్మల
- మూసీ ప్రక్షాళనపై అధ్యయనానికి దక్షిణ కొరియాకు పొంగులేటి
- ఇటీవలే విదేశీ పర్యటనకు వెళ్లొచ్చిన డిప్యూటీ సీఎం



ఖమ్మం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర క్యాబినెట్‌లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులకు విదేశీ పర్యటనల అవకాశం లభించింది. ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేషియా పర్యటనలో ఉండగా, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దక్షిణకొరియాలోని సియోల్‌లో పర్యటిస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క యుఎస్‌ఏ, జపాన్‌లో పర్యటించారు. జిల్లానుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులకు వెంట వెంటనే విదేశీ పర్యటనకు వెళ్లే అవకాశం లభించడం గమనార్హం.

ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు, అభివృద్ధి, ఆయిల్ పరిశ్రమల ఏర్పాటులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యయనం చేసేందుకు మలేషియాలో పర్యటిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికార బృందం కూడా మంత్రి తుమ్మల వెంట ఉంది. మూడు రోజులపాటు మంత్రి తుమ్మల మలేషియాలో పర్యటించనున్నారు. ఆయిల్‌పామ్ సాగులో అగ్రగామిగా ఉన్న మలేషియాలో తక్కువ ఎత్తు పెరిగి నూనె సాంద్రత అధికంగా ఉండే వంగడాలు సాగుచేస్తున్నారు. తక్కువపెట్టుబడితో ఆయిల్‌పామ్ ఉత్పత్తికి పలు రకాల మెళకువలు పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి రైతులు, ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులపై మంత్రి తుమ్మల అధ్యయనం చేసి తెలంగాణలో వాటి అమలుకు అవకాశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. స్వతహాగా ఆయిల్‌పామ్ రైతు అయిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల తెలంగాణలో ఆయిల్‌పామ్ అభివృద్ధికి కార్యచరచణ రూపొందించారు. విదేశీ క్రూడ్‌ఆయిల్ దిగుమతిపై ఇటీవల సుంకం భారీగా పెంచడంలో మంత్రి తుమ్మలదే కీలకపాత్ర పోషించారు. ఫలితంగా దేశంలోని ఆయిల్‌పామ్ గెలల ధర పెరిగింది. ఈ క్రమంలో మలేషియా పర్యటనతో ఆయిల్‌పామ్ సాగును మరింతగా రాష్ట్రంలో ప్రోత్సహించేందుకు మంత్రి తుమ్మల కార్యచరణ రూపొందించనున్నారు.

సియోల్‌లో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాదులోని మూసీ నదిని ప్రక్షాళన చేసి పునరుజ్జీవం కల్పించేందుకు దక్షిణ కొరియాలోని సియోల్‌లో పర్యాటకంగా అద్భుతంగా చెందిన చంగ్ ఏ చంగ్ నదిని పరిశీలించి దాని తరహాలో మూసీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించేందుకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో ప్రతినిధి బృందం అక్కడ పర్యటిస్తోంది. మంత్రి పొంగులేటి గత నాలుగు రోజులుగా అక్కడ చంగ్ ఏ చంగ్ నదిని అధ్యయనం చేస్తున్నారు. రాష్ట్రంలో మూసీతో పాటు నిరుపయోగంగా ఉన్న పలు నదులను కూడా చంగ్ ఏ చంగ్ తరహాలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి అధికారులతో ప్రణాళిక రూపొందించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ పునరుజ్జీవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో సియోల్ వెళ్లిన బృందంలో మంత్రి పొంగులేటితో పాటు మరో మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు, జర్నలిస్టులు కూడా ఉన్నారు.

ఇటీవలనే విదేశాలకు వెళ్లివచ్చిన డిప్యూటీ సీఎం

జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇటీవలే అమెరికాతో పాటు జపాన్‌లో పర్యటించారు. ఆయా దేశాల్లో మైనింగ్, విద్యుత్ రంగంలో వినియోగిస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, రాష్ట్రానికి సంబంధించిన పెట్టుబడుల అంశంపై పలు సమావేశాలకు హాజరై చర్చించి వచ్చారు. ఇలా జిల్లానుంచి ముగ్గురు మంత్రులు కూడా వరుసగా విదేశీ పర్యటనలకు వెళ్లడం, ఆయా రంగాలపై అధ్యయనం చేసే అరుదైన అవకాశం లభించడం గమనార్హం.


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

హామీల అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

- మహిళా సమస్యలపై ఐద్వా అలుపెరుగని పోరాటాలు
- కొత్తగూడెంలో ముగిసిన ఐద్వా రాష్ట్ర మహాసభలు

కొత్తగూడెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఐద్వా రాష్ట్ర ప్రతినిధుల సభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింస, వేదింపులను ప్రోత్సహించేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనుబాధ బావజాలాన్ని విద్యా వ్యవస్థలో జొప్పించడానికి తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తోందన్నారు. దీన్ని ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 34 జిల్లాల నుంచి హాజరైన 600మంది ప్రతినిధులు నివేదికలోని అంశాలన్నింటినీ జిల్లాల వారీగా చర్చించి జిల్లాల వారీ అభిప్రాయాలను తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో గడిచిన మూడు సంవత్సరాల పాటు అనేక పోరాటాలు నిర్వహించామన్నారు. ఈ పోరాటాలపై ఆనాటి రాష్ట్రప్రభత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిందన్నారు. మహిళలపై జరిగిన అత్యాచారాలు, వేదింపులు, పరువు హత్యలకు వ్యతిరేకంగా ఐద్వా పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. గత బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలకు, మహిళాలోకంలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిన నేపథ్యంలోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కానీ ఆ పార్టీ కూడా తాను ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం తగిన కార్యచరణ కానీ నిధులకేటాయింపు కానీ చేయడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలు కాంగ్రెస్ అటకెక్కించిందని విమర్శించారు. కేవలం ఉచిత బస్సు మాత్రమే పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందాలంటే మెరుగైన సౌకర్యాలు, అవసరమైన డాక్టర్లు, సిబ్బంది, మందులు అన్ని స్థాయిల్లోనూ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెండురోజులపాటు జరిగిన రాష్ట్ర ప్రతినిధుల మహాసభలో అఖలభారత (మిగతా 6వ పేజీలో)

ఏసీబీ వలలో విద్యుత్ లైన్‌ఇన్‌స్పెక్టర్

- పాల్వంచలో విద్యుత్ చౌర్యం ఘటనలో కేసు లేకుండా చేసేందుకు లంచం డిమాండ్
- రూ.26వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

పాల్వంచ, అక్టోబరు 23: భద్రాద్రి జిల్లా పాల్వంచలో బుధవారం ఏసీబీ రైడ్‌లో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణ పరిధిలోని కరకవాగుకు చెందిన నాగరాజు అనే వ్యక్తి తాను నిర్మించుకుంటున్న ఇంటకి క్యూరింగ్ కోసం ప్రక్కనే ఉన్న తన మేనమామ ఇంటి నుంచి విద్యుత్ సప్లై తీసుకుని వాడుకుంటున్నాడు. అయితే పాల్వంచ సబ్‌డివిజన్ పాల్వంచ టౌన్-1లో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జిలుగు నాగరాజు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా అన్నపురెడ్డిపల్లి నుంచి పాల్వంచలో ఈ నెల 16న బాధ్యతలు స్వీకరించాడు. అనంతరం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా కరకవాగుకు వెళ్లాడు. ఈ క్రమంలో నాగరాజు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించాడు. దాంతో అతడిపై విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేస్తానని, అలా జరుగకుండా ఉండాలంటే సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఒత్తిడి తెచ్చాడు. తాను కొత్త మీటర్ తీసుకుంటానని బాధితుడు చెప్పినా లైన్ ఇన్‌స్పెక్టర్ వినలేదు. కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.68 వేలు ముట్టచెప్పాలని డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో చివరకు రూ.26 వేలకు బేరం కుదిరింది. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని నాగరాజు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం పాల్వంచ అంబేద్కర్ సెంటర్లో లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు బాధితుడి నుంచి లంచం డబ్బులు రూ.26 వేలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. అనంతరం శాంపిల్స్ సేకరించి పరీక్షించగా పాజిటివ్‌గా తేలడంతో నిందితుడి అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా తాము చేయాల్సిన పనులకు డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



పాఠశాలల్లో బాలికా సాధికారత సంఘాలు

- నవంబరు 4లోపు ఏర్పాటు
- సమస్యలపై అవగాహన కల్పించడమే లక్ష్యం

6

సాహిత్యమే తనకు సాంత్వన

- కవిత్వంలో ఖమ్మం కీర్తి చాటుతున్న ఫణిమాధవి

దేవాలయ దొంగల అరెస్ట్

- తెలంగాణ, ఆంధ్రాలోని పలు ఆలయాల్లో చోరీ
- ఆరుగురు అరెస్ట్.. రూ.1.50లక్షల నగదు రికవరీ
- వివరాలు వెల్లడించిన కల్లూరు ఏసీపీ రఘు

7

సాహిత్యాభిలాషి



సాహిత్యం తన మనోగాయాన్ని మాన్పే ఔషధం.. తను రాసిన ప్రతిపదం ఆమెకు సాంత్వనం.. చదివిన ప్రతివాక్యం గుండెను ఓదార్చే అక్షర నేస్తం.. వాటిల్లిన తీవ్రమానసిక క్షోభను సాహిత్యం అనే ఉపశమనం ద్వారా అధిగమిస్తూ ఆదర్శంగా నిలిచిన కవిత్వ యాత్రికురాలు కన్నోజు ఫణిమాధవి.. బాధను మరిచి పోయేందుకు మనసు స్థిమిత పడేందుకు క్షోభనుంచి కుదుట పడేందుకు స్నేహితులు, తదితర సాహిత్యాభిమానుల సూచనమేరకు సాహిత్యాన్ని ఆశ్రయించినా అనతి కాలంలోనే తెలుగు సాహిత్యంలో తనకుంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించటమే కాదు కవిత్వ పాఠాలు బోధించే స్థాయికి, ఇతర కవుల కవిత్వంలో మంచి చెడులను విషధ పరిచే స్థితికి చేరారు.. జీవితంపైన ఆశావహ దృక్పథం కలిగి ఉండాలని కష్టాలను, నష్టాలను ఎదురొడ్డి పోరాడాలన్న స్ఫూర్తిని చాటుతున్నారు.

సాహిత్యమే.. తనకు సాంత్వన

కవిత్వంలో ఖమ్మం కీర్తి చాటుతున్న కన్నోజు ఫణిమాధవి

రైటర్స్ కార్నర్

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఈమె తండ్రి చిన్నతనంలోనే చనిపోవటంతో తల్లి అన్నీ తానై పెంచింది.. తల్లి ద్వారా మానసిక ధైర్యాన్ని అలవరుచుకుంది. సాహిత్యం పట్ల చిన్నతనం నుంచే ఈమెకు సహజ సిద్ధంగా అభిమానం ఏర్పడింది. ఏడో తరగతి చదివే దశలోనే పత్రికలు చదవటం ద్వారా సాహిత్యంతో స్నేహం ఏర్పడింది. గోర్కి రాసిన 'అమ్మ' నవల తనలోని సాహిత్య అభిమానాన్ని మరింత పెంచింది. ఆ తరువాత ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా, ప్రముఖ సాహితీవేత్త చలం రచనలు ఆమెపై మరింత ప్రభావం చూపి ప్రేరణగా నిలిచాయి. వివాహం జరిగి గృహిణిగా స్థిరపడ్డాక పనుల వత్తిళ్లవల్ల సాహిత్య అధ్యయనం ఆగిపోయినా.. అనుకోని దుర్ఘటన వల్ల తిరిగి సాహిత్యాన్ని ఆశ్రయించేలా చేసింది..

మలుపు తిప్పిన సంఘటన

ఈమెకు ఒక బాబు ఉదయ్‌సిద్ధార్ఢ్, పాప ఈశ్వర స్నిగ్ధ కాగా పాప అకాల మరణం పాలవ్వటంతో తీవ్ర మానసిక క్షోభకు గురైంది. తీవ్రమైన డిప్రెషన్‌లో ఉండగా సాహిత్యం చదవటం వల్ల మానసిక ఉపశాంతి పొందాలని, చేదు స్మృతుల నుంచి కోలుకొని తిరిగి సాధారణ జీవితం గడపాలని కొందరు స్నేహితులు, బంధువులు చెప్పటంతోపాటు మెడికల్ ప్రాక్టీషనర్ అయిన తన భర్త భాస్కర్ సైతం అదే మంచి మందు అని సూచించటంతో సాహిత్యం వైపు దృష్టి మరల్చారు. మొదటగా కథ 2017 అనే పుస్తకంతో మానసిక ఓదార్పునుకు శ్రీకారం చుట్టారు. అలా నిరంతరం చదువుతూ సాహిత్యజ్ఞానాన్ని పెంపొందించుకోవటం ద్వారా తెలుగు సాహిత్యంలో మంచి గుర్తింపు పొందారు.



కవి సంగమంలో కాలమ్..

ఆన్‌లైన్ కవి సంగమం అనే సాహిత్య గ్రూప్‌లో కవిత్వాన్ని పోస్ట్ చేయటంతోపాటు ఇతర కవుల కవితలను ప్రోత్సహిస్తూ విశ్లేషణలు చేసేవారు. తనలోని సాహిత్య ప్రతిభను గుర్తించి కవి సంగమం సారధి యాకూబ్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి గుర్తింపు పొందారు. ఈ క్రమంలో అనేక మంది సాహితీవేత్తల ప్రశంసలను పొందారు. సాహిత్య కాలమ్ నిర్వహిస్తూ అనేకమంది కవుల కవితా సంపుటాలను పరిచయం చేయటం వారి సాహిత్యంలోని గుణ దోషాలను వివరించే స్థాయికి చేరటంతో ఫణిమాధవి పేరు తెలుగు సాహిత్యంలో పదిలం అయ్యింది.

ఇప్పటి వరకు...

ఫణిమాధవి అనేక కవితలు ఇప్పటి వరకు దిన, వార పత్రికల్లో ప్రచురించబడ్డాయి.. వాటితోపాటు ఆమె సామభేధ అనే కవితా సంపుటిని 2023లో వెలువరించారు. ఈ కవితా సంపుటికి 2024లో డాక్టర్ రాధేయ అవార్డును పొందారు. తదుపరి 2024లో తాను కవి సంగమం గ్రూప్‌లో రాసిన సాహిత్య విశ్లేషణలతో 'మేఘాల నీలాల్లోకి' అనే వ్యాసాల సంపుటిని వెలువరించారు.

సమగ్ర కులాల స్థితిగతుల సర్వే

- ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులాల స్థితిగతులు తెలుసుకునేందుకు ఉమ్మడి జిల్లాలవారీగా చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసు కోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. బుధవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయదేవితో కలిసి కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర కులాల స్థితిగతుల సర్వేపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సమీక్షలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ సమగ్ర కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ జరపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సమగ్ర కులాల సర్వే చేపట్టిందని అన్నారు. కులగణన కేంద్రం పరిధిలో ఉందని తెలిపారు. బీసీలే కాకుండా మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ మొదలగు అన్ని కులాల సమగ్ర వివరాలకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ వివ రణపై జిల్లాలోని ప్రజాప్రతినిధులకు ముందస్తుగా సమాచారం అందించాలని, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు స్టేజీపై కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. డిసెంబరు 9లోపు సంపూర్ణ సమాచారం సేకరించాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచు కొని ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ముఖ్యప్రణాళిక అధికారి ఏ.శ్రీనివాస్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

ఖమ్మంటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టరేట్‌లోకి విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నేతలు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. తొలుత విద్యార్థులు భారీసంఖ్యలో కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించగా, పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా.. అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గసభ్యులు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌ల బకాయిల విడుదల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. 2021లో 30శాతం, 2022లో 20శాతం బకాయిలు విడుదల చేసి, 2023లో అసలు నిధులే విడుదల చేయలేదని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు రోడ్డునపడే పరిస్థితికి వచ్చిందన్నారు. పెండింగ్‌లు బకాయిలు వెంటనే విడుదల చేయకుంటే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు ఎస్‌కే.నాగుల్‌మీరా, మధు, శివనాయక్, జిల్లా నాయకులు మనోజ్, రాకేష్, ప్రతాప్, గోపి, రోహిత్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏఐఎస్ఎఫ్ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

హైదరాబాద్ రూట్‌ను

మూడు మస్టర్లుగా పునరుద్ధరించాలి

భద్రాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆర్టీసీ డిపోలో హైదరాబాద్ రూట్‌లో మూడు మస్టర్ల డ్యూటీని తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ ఆర్టీసీ డిపో మేనేజరుకు డిపో డ్రైవర్ల తరపున బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈనెల 25 నుంచి ఈ నిర్ణయాన్ని యాజమాన్యం అమలు చేయనుండటంతో డ్రైవర్లపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఇప్పటికే కండక్టర్‌లు చేయాల్సిన పనిని సైతం తామే చేస్తూ ప్రయాణికులను పికప్ చేసుకోవడం, వాటర్ బాటిల్స్ ఇవ్వడం, డ్రైవింగ్‌తో ఒత్తిడికి గురవుతున్నామని, ఈ సమయంలో తమకు ఒక మస్టర్‌ను తగ్గించడం అందుకు మా అనుమతి తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. కావున డిపో మేనేజరు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రెండు బీహెచ్‌ఈఎల్ సర్వీసుల్లో తిరిగి మూడు మస్టర్ల డ్యూటీ పునరుద్ధరించాలని లేకపోతే కండక్టర్లనైనా తమకు కేటాయించాలని కోరారు.

పోలీసు శిక్షణా కేంద్రంలో

మాబ్ ఆపరేషన్ మాక్‌డ్రిల్ ప్రాక్టీస్



మాట్లాడుతున్న సీపీ

ఖమ్మంక్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న సమయంలో అల్లరి మూకలను చెదరగొట్టడానికి మాబ్ ఆపరేషన్ మాక్‌డ్రిల్ ముఖ్య ఉద్దేశమని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ అన్నారు. శిక్షణలో భాగంగా పోలీసు శిక్షణ కేంద్రంలో సివిల్, ఏఆర్ పోలీసులు, మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ బుధవారం నిర్వహించారు. విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ జనసమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్, మాక్‌డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి వివరించారు. అల్లరిమూకలను ఎదుర్కొనేందుకు బాష్పవాయు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్‌డిపార్టుమెంట్‌వారితో వాటర్ క్యాన్లు వారిపై ప్రయోగించడం, లాఠీచార్జి చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికి పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి డెమో ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్‌కుమార్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, ఏసీపీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కూరగాయలు కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	50
వంకాయ	48
గుత్తి వంకాయ	50
బీరకాయ	48
పచ్చిమిర్చి	58
కాకరకాయ	48
బెండకాయ	48
పొట్లకాయ	60
దోసకాయ	50-60
గోరుచిక్కుడు	56
క్యాబేజీ	26
దొండ	40-48
సొరకాయ	36
క్యారెట్	48
క్యాప్సికం	88
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	55-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

తోటల సంరక్షణపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- పండ్లు, మిరప, ఆయిల్ పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు
- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో పండ్ల తోటలు, మిరప, ఆయిల్‌పామ్ తోటల సంరక్షణపై రైతులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి యంవీ మధుసూదన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పండ్ల తోటల్లో మామిడి, జామ, సీతాఫలం, అరటి, నిమ్మ, బొప్పాయి సాగులో రైతులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. మిరప పంట సాగులో వైరస్ తెగుళ్ల నుంచి పంటను కాపాడుకొని ఎక్కువ దిగుబడులు పొందేందుకు ఉద్యానవన శాఖ అందించిన మెళకువలను పాటించాలన్నారు. ఆయిల్ పామ్ మొక్కల ఎదుగుదలకు సూక్ష్మ స్థూల పోషకాలను అందించాలని, కొత్తగా నాటిన ఆయిల్ పామ్ తోటలోని మొక్కలకు మొదటి దఫా ఎరువులను నాటిన మూడు నెలల తర్వాత మాత్రమే వేయాలన్నారు. కాండం తడి తెగులు అనేది ఆయిల్‌పామ్ సాగులో అత్యంత ప్రమాదకరమని, దీని నివారణకు కాండం శస్త్ర చికిత్స చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గవర్నర్ సారూ.. మా గోడు వినరూ..!

(5వ పేజీ తరువాయి)

పలు ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాలకు తరలివెళ్లాయి. ఫలితంగా భద్రాచలం అభివృద్ధికి నోచుకోక అనేక సమస్యలతో కూనారిల్లుతోంది. దీంతో యటపాక, గుండాల, పురుషోత్తపట్నం, పిచుకలపాడు, కన్నాయిగూడెం పంచాయతీలను తిరిగి భద్రాచలంలో విలీనం చేయాలని ఆ ప్రాంతవాసులతో పాటు భద్రాద్రివాసులు సైతం దశాబ్దకాలంగా కోరుతూనే ఉన్నారు. 2017 నవంబరులో అప్పటి సీఎం కేసీఆర్ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలంలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి అనంతరం ఆ ఊసే మరిచారు. గత ఏడాది అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు సైతం అప్పటి ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఐదు పంచాయతీలను భద్రాద్రిలో విలీనం చేయాలని స్థానిక నాయకులతో కలిసి విన్నవించారు. అలాగే భద్రాచలం పర్యటన సమయంలో సైతం గవర్నర్‌కు ఏపీలోని ఐదు పంచాయతీలకు చెందినవాసులు వినతిపత్రం అందజేశారు. తాజాగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నూతన ప్రభుత్వాలు కొలువుదీరిన అనంతరం ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అందరూ భావించారు. ఈ దిశగా ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చించారనే ప్రచారం సైతం జరిగింది. కానీ ఆచరణలో మాత్రం ఎటువంటి కదలికలేకపోవడంతో భద్రాద్రి ఏజెన్సీవాసులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.



ఐటీసీ గెస్ట్‌హౌజ్

జఠిలంగా మారిన రామయ్య భూముల పరిరక్షణ

నాడు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో భద్రాద్రి రాముడు తెలంగాణ దేవుడు అని తెలంగాణవాదులు నినదించారు. కాని రాష్ట్రం ఆవిర్భావం అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం తెలంగాణలో.. రామయ్య భూములు భద్రాచలానికి కూతవేటుదూరంలోని ఏపీ పరిధిలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్నాయి. ఇక్కడ భద్రాద్రి రామయ్యకు 889.50 ఎకరాల భూమి ఉంది. ఇందులో 109 ఎకరాల్లో 2018లో శ్రీగోకుల రామం నిర్మాణం చేపట్టగా అడుగడుగునా స్థానికుల నుంచి అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇక్కడ రామయ్య భూములను తరచూ స్థానికులు ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతుండటంతో రామయ్య భూముల పరిరక్షణ జఠిలంగా మారింది. ఏపీలోని కీలక శాఖల అధికారుల సహకారం సైతం అంతంతమాత్రంగానే ఉంటోందనే వ్యాఖ్యలు దేవస్థానం వర్గాలు తరచూ ఫిర్యాదులు చేస్తూనే ఉన్నాయి.

ఆ ఎనిమిది కి.మీ రహదారితో సమస్యే

భద్రాచలం నుంచి పర్ణశాల రామాలయానికి వెళ్లే మార్గంలో మేడువాయి నుంచి తూరుబాక వరకు ఎనిమిది కి.మీ రహదారిలో వెళ్లాలంటే నరకం చూడాల్సిందే. ఈ ఎనిమిది కి.మీ. ఆంధ్రా పరిధిలో ఉండటం, తూరుబాక బ్రిడ్జి దాటిన అనంతరం మళ్లీ తెలంగాణ ప్రాంతంలోకి ప్రవేశిస్తారు.

దీంతో సాంకేతికపరంగా సమస్యలు తలెత్తుతున్నాయి. భద్రాద్రి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయానికి వెళ్లాలంటే ఏపీ పరిధిలో ప్రయాణించాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో ఈ మార్గంలో వెళ్లే వారికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఇదిలా ఉండగా రామాయణంతో ముడిపడి ఉన్న చారిత్రక ప్రాంతాలు భద్రాద్రి పరిధిలో ఉండటమే సముచితమనే వ్యాఖ్యలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి.

'సర్కారు'కు నిర్లక్ష్యపు రోగం

(5వ పేజీ తరువాయి)

కొందరు రాకపోకలు సాగిస్తుండగా కొందరు ప్రైవేటు ఆసుపత్రులుండంతో అక్కడే ఉంటున్నారు. డాక్టర్లు సక్రమంగా రాకపోవడంతో రోగుల సంఖ్య నామ మాత్రంగా ఉంది. వచ్చిన వారు కూడా డాక్టర్లు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు ఇక్కడ ఆపరేషన థియేటర్ మూడేళ్లుగా పనిచేయడంలేదు. ఏదైనా ఆపరేషన్ ఉంటే ఖమ్మానికి రిఫర్ చేస్తున్నారు. కొత్త ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. పేరుకు వంద పడకల ఆసుపత్రి అయినా ఇక్కడ ప్రైమరీ హెల్త్ సెంటర్ సేవలే అందుతున్నాయి. పూర్తిస్థాయి ఆసుపత్రిగా సేవలందించాలంటే డాక్టర్లు స్థానికంగా ఉంటేనే సాధ్యమవుతుందని ప్రజలు సూచిస్తున్నారు.

తిరుమలాయపాలెంలోనూ డాక్టర్లు సెలవులో ఉండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఐదుగురు డాక్టర్లు సెలవులో ఉన్నారు. పేరుకు ఏరియా ఆసుపత్రి అయినా అందుకు తగిన వైద్యం ఇక్కడ అందడంలేదు. పీహెచ్‌సీస్థాయిలోనే సేవలందిస్తున్నారు. పెనుబల్లి ఏరియా ఆసుపత్రిలోనూ డాక్టర్ల కొరత ఉంది. పెనుబల్లి ఏరియా ఆసుపత్రిలో 12మంది వైద్యులకుగాను ఏడు గురు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఐదుగురు డిప్యుటేషన్‌పై నియమితులయ్యారు. 30 పడకల ఆసుపత్రి అయినా ఆసుపత్రిలో సౌకర్యాలు సక్రమంగా లేవు. మరుగుదొడ్లు అస్తవ్యస్థంగా ఉన్నాయి. దీంతో ఆరుబయటే స్నానాలు చేయాల్సి వస్తుంది.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి: డీఎస్పీ

కరకగూడెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని, మారుమూల గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కరకగూడెం పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, సిబ్బంది గదలను పరిశీలించిన ఆయన రికార్డులను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రాజేందర్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది దుర్గరావు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలి



మహాసభకు హాజరైన ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు, నాయకులు

(5వ పేజీ తరువాయి)

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీక శ్రీమతి, దావలె కోశాధికారి ఎస్. పుణ్యవతి, జాతీయ ఉపాధ్యక్షురాలు సుధా సుందర్‌రామన్, రాష్ట్ర కార్యదర్శి నివేదికను 34జిల్లాల నుంచి పాల్గొన్న ప్రతినిధులు చర్చల సారాంశాన్ని పరిశీలించారు. రెండు రోజుల మహాసభకు అధ్యక్షవర్గంగా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ఉపాధ్యక్షులు పి. ప్రభావతి, గీతారాణి, డి. అనిత, వినోద వ్యవహరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి, బుగ్గవీటి సరళ, ఆశాలత, అనురాధ, మాచర్ల భారతి, రత్నమాల బండి పద్మ, డి. ఇందిర, కే. నాగలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎం. జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు డి. సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే దేశ భవిష్యత్

మహిళలు-ఆరోగ్యం అనే అంశంపై డాక్టర్ నీలిమ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశ ఆర్థిక అభివృద్ధి బాగుంటుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా వారి ఆరోగ్యం, ఆహారం పట్ల ఎక్కువగా నిర్లక్ష్యం వహిస్తుంటారరు. పెరుగుతున్న ధరలతో పూర్తిస్థాయిలో పౌష్టికాహారాన్ని తీసుకోలేకపోతున్నారన్నారు. ఈ మహాసభల చివరి రోజు కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అధ్యక్షత వహించగా అఖిలభారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీకే శ్రీమతి, దావలె, కోశాధికారి పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుధా సుందర్‌రామన్, రాష్ట్ర కార్యదర్శి మల్లి లక్ష్మీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సరళ, హైమావతి జిల్లా కార్యదర్శి ఎం. జ్యోతి, అధ్యక్షులురాలు డి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బాలికా సాధికారత సంఘాలు

- నవంబరు 4లోపు ఏర్పాటు
- పలు సమస్యలపై అవగాహన కల్పించడమే లక్ష్యం

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మహిళల సంరక్షణకు ప్రభుత్వాలు కఠినచట్టాలను రూపొందించి శిక్షలు అమలు చేస్తున్నా కొన్ని చోట్ల ఇంకా బాలికలపై లైంగికదాడులు జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో బాలికల పట్ల అనుచిత ధోరణితో ఇబ్బందులు పెట్టే కామాంధులున్నారు. ఈ క్రమంలో బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు పాఠశాల స్థాయిలోనే బాలికా సాధికారత సంఘాల ఏర్పాటుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. పలు సంఘటనలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఆడపిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులను నివారించేందుకు విస్తృత ప్రచారం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఈ సంఘాలు అండగా నిలవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వచ్చే నెల 4వ తేదీ లోపు ఈ సంఘాలను ఏర్పాటుచేయాలని విద్యాశాఖను ఆదేశించింది. బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు ప్రతి పాఠశాలలో గ్రీవెన్స్ బాక్స్ ఏర్పాటు చేసి ప్రధానోపాధ్యాయుల సమక్షంలో తెరిచి సమస్యలు తెలుసుకుని పరిష్కారాలు చూపుతారు. కౌమార దశలో బాలికల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడంతో పాటు సమాజంలో తోటివారి పట్ల ఏ విధంగా నడుచుకోవాలి, వారినుంచి ఎదురయ్యే ఇబ్బందులను ప్రాథమిక దశలోనే ఎదురించడం, పాఠశాల స్థాయిలో ఆడపిల్లలలో కనిపించే శారీరక మార్పులపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఆయా సంఘాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చైర్మన్, మహిళా ఉపాధ్యాయురాలు, ప్రతి సెక్షన్ నుంచి ఇద్దరు చురుకైన బాలికలు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుల్ సభ్యురాలుగా ఉంటారు. వీరంతా ప్రతినెల విధిగా సమావేశం ఏర్పాటుచేసుకుని బాలికల్లో భయాందోళనలను తొలగించి అనుమానాలు నివృత్తి చేస్తూ మనోధైర్యం కలిస్తూ ఎటువంటి అవరోదాలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచిస్తారు. ప్రతి మూడునెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాల్లో ఏడు అంశాలపై అవగాహన కల్పించి అండగా ఉంటామనే భరోసా కల్పిస్తారు. జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మరో కమిటీని నియామకం మార్గదర్శకాలు జారీ చేసింది. పాఠశాల స్థాయిలో బ్యానర్ కరపత్రాల ముద్రించడం, తదితర ఖర్చుల నిమిత్తం రూ.500లను ప్రభుత్వం పారితోషికంగా అందిస్తుంది. ప్రతినెల నిర్వహించే సమావేశాల్లో అందిన సమాచారానికి సంబంధించిన సమస్యల పురోగతి, తాజా విషయాల తీరుతెన్నులపై చర్చిస్తారు.



'సాగునీటి సౌకర్యం కల్పించాలి'

అశ్వాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల మిగులు భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలని బుధవారం ప్రాజెక్ట్ పరిధిలోని అశ్వాపురం, దుమ్ముగూడెం, మణుగూరు, చర్ల మండలాలకు చెందిన అఖిల పక్ష నేతలు భద్రాచలం ఆర్డీవో దామోదరావుకు వినతిపత్రం అందజేశారు. సీతమ్మసాగర్ పనుల్లో బాగంగా రైతులకు సంబంధించిన మోటార్లు,పైపలైన్లు ధ్వంసం కావటంతో మిగులు భూములకు సాగునీరు అందటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణలో భాగంగా కొత్తగా సర్వేచేస్తున్న భూములకు పరిహారం ఇవ్వాలని ఆర్డీవోకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కేశవరెడ్డి, రామచంద్రరాజు, లక్ష్మీనారాయణ, దామోదరావు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అయోడిన్ లోప రుగ్మతలపై అవగాహన శిబిరం

పినపాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అయోడిన్ లోపం వల్ల మనుషుల్లో సంభవించే రుగ్మతలపై అవగాహన శిబిరం, పినపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. పినపాక వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన శిబిరంలో ప్రభుత్వ వైద్యురాలు దుర్గాభవాని విద్యార్థులకు అయోడిన్ ఉప్పు వినియోగం ఉపయోగాలను, ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరు వయస్సు ఆధారంగా ప్రతిరోజు కనీసం 5గ్రాములకు మించకుండా అయోడిన్ ఉప్పును వాడుకోవాలని, మంచి శారీరక, మానసిక ఆరోగ్యం, శారీరక పెరుగుదల, చురుకుదనం, ఉత్సాహం, జ్ఞాపక శక్తి, సంగ్రహణ శక్తి వంటి వాటిని పొందేందుకు, స్త్రీలలో గర్భస్రావం, మృత శిశువు జనన నిరోధం, అంగవైకల్య శిశువుల జననం వంటి రుగ్మతల నిరోధానికి, గొంతువాపు, మరుగుజ్జుతనం, బుద్ధిమాంద్యత, చెవిటి, మూగతనాన్ని రాకుండా కాపాడుకునేందుకు అయోడిన్ ఉప్పు ఎంత అవసరమో, ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమణ, హెచ్‌ఈవో హనుమంతు, హెల్త్ అసిస్టెంట్ వెంకట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓపీకకు పరీక్ష

- ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో పర్యవేక్షణ కరవు
- ఉండాల్సిన వైద్యులు 125మంది.. ఉన్నది 65మందే
- సమయం పాటించని వైద్యులు, సిబ్బంది
- మందుల కొరతతో ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్న రోగులు

ఆంధ్రజ్యోతి విజిట్



ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో 9.15కి ఓపీలో పరిస్థితి ఇలా..

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్యసేవలు అగమ్య గోచరంగా మారాయి. సమయానికి రావాల్సిన వైద్యసిబ్బంది ఇష్టానుసారంగా వస్తున్నారు. మందులు అందుబాటులో ఉన్నా రోగులకు పంపిణీలో ఇబ్బందులే ఉన్నాయి. ఆస్పత్రి ఆవరణంలోకి వచ్చినప్పటి నుంచే రోగులను కష్టాలు ఆవరిస్తున్నాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది గంటసేపైనా ఉండడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఆస్పత్రిని బుధవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో పలుఅంశాలు వెలుగులోకి వచ్చాయి. అనారోగ్యంతో అంబులెన్స్‌లోనూ, ఆటోలోనూ తమ వారిని ఆస్పత్రికి తీసుకొస్తే అక్కడి నుంచే కష్టాలు మెదలవుతాయి. మూడు చక్రాల బండి, స్ట్రెచర్ ఉన్నా అక్కడ పీసీ కేర్ అందుబాటులో ఉంచడంలేదు. దీంతో బంధువులు, కుటుంబీకులే చక్రాల్లో, స్ట్రెచర్‌పై తోసుకుంటూ తీసుకెళుతున్నారు.

ఓపీ నమోదుకు నిరీక్షణే!

జిల్లా ఆస్పత్రికి నిత్యం 15 వందల మంది నుంచి రెండు వేలకు పైగా రోగులు వస్తుంటారు. వారివివరాలను ఈసుశ్రుత్‌లో భాగంగా ఆన్‌లైన్ చేసే ప్రక్రియ ప్రారంభించారు. ఈ ప్రక్రియతో ప్రయోజనమే అయినప్పటికీ తీవ్ర జాప్యంతో రోగులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. అదనపు ఓపీ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది

వైద్య పరీక్షకు పరీక్షే

జనరల్ మెడిసిన్, ఆర్థో, ఈఎన్టీ, డెర్మటాలజీ, మహిళలు, పురుషుల ఓపీ విభాగాల్లో 9.15కి రోగులు వచ్చి బారులు తీరినప్పటికీ వైద్యులు మాత్రం రాలేదు. రోగుల వివరాలను నమోదు చేసే ఏఎన్ఎంలు కూడా రాలేదని, కారణంగానే రోగులు వేచి ఉండాల్సి వస్తోందన్నారు. 9.45కి నింపాదిగా ఆయా విభాగాలకు వైద్యులు వచ్చారు. పూర్తిస్థాయిలో హెచ్‌వోడీలు రాలేదు.

రక్త పరీక్షకు అవస్థలే

క్రమంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తుండడంతో రక్తపరీక్షల కోసం వైద్యులు చిటీలు రాశారు. సీజనల్ జ్వరాలు, జ్వరం, జలుగు దగ్గుతో వచ్చిన వారికి పరీక్షలను చేయించాలని సూచించారు. ఆచిటీలతో రక్తపరీక్షకోసం శాంపిల్స్ తీసుకునే కేంద్రానికి వచ్చారు. అక్కడ ఉన్న నలుగురు కూడా శిక్షణ సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. పూర్తిస్థాయి నర్సులు అందుబాటులో లేరు. 10.30 తర్వాత వారు విధుల్లోకి వచ్చారు. పాస్టింగ్ షుగర్ పరీక్ష కోసం వచ్చిన రోగులు 9గంటల వరకు వేచి ఉన్నారు.

మూలన పడిన ఎక్స్‌రే మిషన్ ..!

ఆస్పత్రిలో రెండు ఎక్స్‌రే మిషన్లు ఉండగా వీటిలో ఒకటి పనిచేయడంలేదు. నిత్యం ఇక్కడకి 100నుంచి 200వరకు ఎక్స్‌రేలు తీయాల్సి ఉంటుంది. ఇక్కడ ఒక మిషన్ మూలన పడిపోయింది. ఒక్కదానిపైనే తీస్తుండడంతో





రోగులను తీసుకెళుతున్న బంధువులు, ఇంకా తొలగించని చెత్తడబ్బాలు

రోగులు వరుసల్లో నిల్చోవాల్సి వస్తుంది. తాత్కాలిక సిబ్బంది, శిక్షణ సిబ్బంది ఉండడంతో ఎక్కువసేపు నిరీక్షించాల్సి వస్తోంది. సీటీ స్కాన్‌మిషన్ పనిచేయక పదిరోజులు దాటింది.

మందులు కొరతే

జిల్లా ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించుకుని మందుల చిట్టీ తీసుకునివెళ్తే అక్కడ మందులు అందుబాటులో లేవు. ఒక మహిళ కంటి పరీక్ష నిర్వహించుకుని చుక్కల మందు కోసం వెళితే అక్కడ సిప్రాన్ చుక్కల మందులేవు. అంతేకాదు ఓఫ్లాక్స్, రాంటాక్, డెరిఫిల్, ఎట్రోఫిన్, వాయిల్స్ అందుబాటులో లేవు. బెల్జియం, పాన్‌టాప్, పొటాషియం క్లోరైట్, ట్రిమడాల్, టిస్టాట్, పెప్టాజ్ మందులు ఆస్పత్రి స్టోర్‌లో లేవని వెనుదిప్పుతున్నారు.

కట్టుకట్టాలంటే గంటల తరబడి

ఖమ్మం నగరానికి చెందిన తాజాముల్‌ఖాన్ చేయి విరగడంతో ఆస్పత్రికి వచ్చాడు. ఉదయం 9గంటల నుంచి నిరీక్షిస్తున్నా 10.30 వరకు కూడా కట్టు కట్టలేదు. అదేమని అని అడిగితే కడతాం ఆగండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పుతున్నారని ఆరోపించాడు. వాస్తవంగా ఇక్కడ కట్టు కట్టించుకోవాలంటే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

ఆసుపత్రిలో అపరిశుభ్రత

ఆస్పత్రిలోపారిశుధ్యం అంతంత మాత్రంగానే ఉంది. ఆసుపత్రి వెనుక భాగంగా తీవ్ర అపరిశుభ్రత ఉంది. ప్రధాన విభాగాల్లో చెత్తచెదారాన్ని సరైన సమయానికి తొలగించడం లేదు. వార్డులు, సూపరింటెండెంట్, ఆర్ఎంవో గదులను కూడా 9.40 తర్వాతే శుభ్రం చేస్తూ కనిపించారు. ఇక చెత్తడబ్బాలను కూడా 9.45 వరకు తొలగించలేదు. ఇక ఆస్పత్రి ఆవరణంలో ఉన్న సీసీ కెమెరాల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా ఉంది. ఆర్ఎంవో, సూపరింటెండెంట్ చాంబర్లకు అనుసంధానంగా ఉన్న సీసీ కెమెరాలు కొన్ని సరిగ్గా పనిచేయడం లేదు.

ఆరుబయిటే శిశువులకు స్నానాలు



ఆరుబయటే శిశువుకు స్నానం చేయిస్తున్న కుటుంబసభ్యులు

పెనుబల్లి:పెనుబల్లిసీహెచ్‌సీకి రోగులు ఉదయం 8.30 గంటల నుంచే రావడం ప్రారంభించారు. ఉదయం 9.30 వరకు వైద్యులు ఆసుపత్రికి వస్తూనే ఉన్నారు. ఉదయం 9.30 నుంచి 10గంటల వరకు సిబ్బంది ఆసుపత్రికి వస్తూనే ఉన్నారు.8.30గంటల నుంచే రాత్రి డ్యూటీ చేసిన వైద్యురాలు రోగులను పరీక్షించటం మొదలుపెట్టారు. ఆసుపత్రిలో ఏడుగురు వైద్యులు ఉన్నప్పటికీ ఐదుగురు మాత్రం రాత్రి డ్యూటీ చేస్తూ విధులు నిర్వర్తిస్తున్నారు. మరోఐదుగురు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వీరితోపాటు ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవో వారి విధులతోపాటు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజువారీగా సుమారు 200మంది బయట రోగులు వస్తుండగా 98మంది ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రతపై వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణ కొరవడింది. దీంతో శిశువుల స్నానాలు ఆరుబయటనే చేయిస్తున్నారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయలేదు.

తిరుమలాయపాలెంలో ఒంటిగంటకే వైద్యుల ఇంటిబాట

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో వివిధ ప్రాంతాల నుంచి రోగులు వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వారికి సరైన వైద్యం అందలేదు. పేరుకు వంద పడకల ఆసుపత్రి అయినా అందుకు తగిన వైద్యులను ప్రభుత్వం నియమించలేదు. ఈఆసుపత్రిలో మొత్తం 9 మంది వైద్యులుండగా వారిలో ఐదుగురు సెలవులో ఉన్నారు. మిగతావారు విధులకు హాజరయ్యారు. దీంతో వైద్యం అంతంతమాత్రంగా అందుతోంది. అలాగే పీహెచ్‌సీలో కూడా వైద్య సిబ్బంది కొరత ఉంది. దీంతో రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. సీసీకెమేరాలు కూడా ఏర్పాటు చేయలేదు. రోగులకు మూత్రశాలలు కూడా లేవు. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఉదయం 9గంటలకు వచ్చి 4గంటల వరకు పనిచేయాల్సి ఉండగా 1గంటకే ఇంటిబాట పడుతున్నారు.



తిరుమలాయపాలెంలో వైద్యుల కోసం రోగుల ఎదురు చూపులు

గవర్నర్ విందుకు ఖమ్మం వంటకాలు

- నేడు సూర్యాపేట జిల్లాలో గవర్నర్ పర్యటన
- ఖమ్మం రెస్టిన్ హోటల్ నుంచి వంటకాలు

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రగవర్నర్ జిష్టుదేవ్ రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం సూర్యాపేట జిల్లాలో, శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన విందుకు ఖమ్మం పాకశాల నుంచి వంటకాలు వెళ్లనున్నాయి. సూర్యాపేట జిల్లాలో గవర్నర్ పర్యటనకు ఖమ్మంలోని ప్రముఖ రెస్టారెంట్ రెస్టిన్ నుంచి వంటకాలు వెళ్లనున్నాయి. గవర్నర్ మెనూ చార్టును సూర్యాపేట జిల్లా అధికారులు రెస్టిన్‌కు బుధవారం పంపారు.

మెనూ ఇలా..

వెలకం డ్రింక్:
కోకో మింట్ మరియు లెమన్
సాలాడ్: గ్రీన్ సాలాడ్
స్వీట్: జిలేబి విత్ రబ్బడి, పాలతాలికలు, సేమియా ఖీర్, అన్నవరం స్వీట్
స్టార్టర్: కోడివేపుడు బోన్‌లెస్, ఫిష్‌ఫ్రై, కొర్రమేను ఫ్రై, ఉడకపెట్టిన గుడ్డు
నాన్‌వెజ్ కర్రీస్: బటర్ చికెన్, నాటుకోడి కర్రీ, తెలంగాణ మటన్ కర్రీ
వెజ్ స్టార్టర్: క్రిస్పీ క్యారెట్, పన్నీర్ ఘీ రోస్ట్
వెజ్ కర్రీస్: పన్నీర్ చపాటా, బచ్చలకూర, మామిడికాయ పప్పు, బగార, బెండకాయ కాజు ఫ్రై, సాంబారు, చెట్నీలు
రైస్: చికెన్ దమ్‌బిర్యానీ, వెజ్ బిర్యానీ, మిర్చిక సాలాన్, రైతా, వైట్ రైస్, పెరుగు.

కేటీఆర్‌కు రామయ్య ప్రసాదం అందజేత

భద్రాచలం,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావుకు భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ప్రసాదం, చిత్రపటం బుధవారం హైదరబాద్‌లో బహూకరించారు. నియోజకవర్గంలో పార్టీ, ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

కాంగ్రెస్ ప్రభుత్వంలో.. మహిళలే మహారాణులు

- మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ ఆగస్త్య
- జిల్లా హాస్పటల్, తహసీల్దార్ కార్యాలయాల్లో మహిళా శక్తి క్యాంటిన్లు ప్రారంభం



తహసీల్దారు కార్యాలయంలో మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభిస్తున్న మేయర్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలే మహారాణాలుగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతాయని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని ఖమ్మం అర్బన్ తహసిల్దారు కార్యాలయం, జిల్లా హాస్పటల్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లను మేయర్ ప్రారంభించారు. మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల ద్వారా ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే ఖమ్మం నగర పాలక సంస్థతో పాటుగా మూడు క్యాంటిన్లు ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ నామామాత్ర ధరతో భోజనం, టిఫిన్లు అందిస్తారని చెప్పారు. కమిషనర్ అభిషేక్ ఆగస్త్య మాట్లాడుతూ క్యాంటిన్ల నిర్వాహణ సక్రమంగా నిర్వహించి మరింతగా మహిళలు ఆర్థికంగా తోడ్పాటు జరగాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ రాజశేఖర్, ఆర్ఎంవోలు రాంబాబు, కళావతిబాయి, అసిస్టెంట్ కమిషనర్ ఆహ్మద్‌ఉల్లా, కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు, మాజీ కార్పొరేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్, మెప్మా డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, సీవోలు పాల్గొన్నారు.

ఎస్ఏఆర్ రైస్‌మిల్లు ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి

కొణిజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులను, ప్రభుత్వాన్ని మోసం చేసి కోట్లాదిరూపాయల కుంభకోణానికి పాల్పడిన కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలోని ఎస్ఏఆర్ రైస్‌మిల్లు యాజమాన్యానికి చెందిన ఆస్తులను వెంటనే స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేయాలని సీపీఎం, రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఏఆర్ రైస్ మిల్లు ముందు రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లుకు ధాన్యాన్ని పంపగా క్వింటాకు ఐదు నుంచి పది కేజీలు తేమ, తాలు పేరుతో కోతపెట్టి రూ.కోట్ల రైతుసొమ్మును మిల్లు యాజమాన్యం కాజేసిందని, ప్రభుత్వాన్ని సైతం మోసం చేసిందని తెలిపారు. మిల్లు యాజమాన్యం ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం ను ప్రవేటు వ్యక్తులకు విక్రయించి వచ్చిన సొమ్ముతో వందలాది ఎకరాలు భూములను కొనుగోలు చేశారని ఆరోపించారు. రైతుల పంటపొలాలకు వెళ్లే రహదారులను కూడ ఆక్రమించారన్నారు. రూ. 81 కోట్లు అవినీతికి పాల్పడ్డారని గుర్తించి కూడ నెలలు గడుస్తున్న మిల్లుయాజమాన్యం పై ఇంతవరకు చర్యలు తీసుకోవడంలేదని, జిల్లా అధికారులు మౌనంగా ఉండటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చెరుకుమల్లి కుటుంభరావు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, సంక్రాంతి పురుషోత్తం, బోడెపుడి వీరభద్రం, సుంకర సుధాకర్, నాగేశ్వరరావు, ఆనందరావు, రాంబాబు, ప్రసాద్, రవి, అఫ్జల్, కృష్ణారావు, మధు, ఈజయ్, రామకృష్ణ, రామారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలిక మృతి

లక్ష్మీదేవిపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గతంలో లక్ష్మీదేవిపల్లి మండ లం ఓ లో గ్రామంలో అత్యాచారానికి గురైన బాలిక (14) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన చోటుచే సుకుం ది. ఈ సమాచా రం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ మేరెడ్డి వసంత బుధవారం ఆ గ్రామానికి వెళ్లి బాలిక మృతదేహాన్ని సంద ర్శించి కుటుంబ సభ్యులను పరామ ర్శించా రు. బాలిక మృతి చెందడం బాధాకర మని, కుటుంబసభ్యులు ఓదార్చారు. సమా జంలో చిన్నారులపై జరుగుతున్న అత్యాచా రాలను ఖండించాలని భవిష్యత్‌లో పునారా వృతం కాకుండ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు మేరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శేఖర్ ఉన్నారు.

దేవాలయ దొంగల అరెస్ట్

- తెలంగాణ, ఆంధ్రాలో పలు ఆలయాల్లో చోరీ
- ఆరుగురు అరెస్ట్..
- రూ.1.50లక్షల నగదు రికవరీ
- వివరాలు వెల్లడించిన కల్లూరు ఏసీపీ రఘు



వివరాలు వెల్లడిస్తున్న కల్లూరు ఏసీపీ రఘు

సత్తుపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో పలు ఆలయాలలో చోరీలకు పాల్పడుతున్న ఓ మైనర్‌తో పా టు ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కల్లూ రు ఏసీపీ ఏ.రఘు తెలిపారు. బుధవారం సత్తుపల్లిలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 22న వేంసూరు మండలం కందుకూరులో కొందరు రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా తిరుగుతున్నారనే సమాచారం రావడంతో వేంసూరు ఎస్ఐ వీరప్రసాద్ తన సిబ్బందితో వెళ్లగా పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం రుజువైనట్లు తెలిపారు. కందుకూరు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో దొంగతనం చేసేందుకు రెక్కీ చేస్తున్న ఆంధ్రాలోని పెనుగంచిప్రోలు, సమీప ప్రాంతాలకు చెందిన ఎల్లబోయిన గోపీ, అద్దంకి గురవయ్య, అద్దంకి శివ, ముంగి రాము, ముంగి కృష్ణ అలియాస్ కిట్టులతో పాటు మరో బాల నేరస్థుడనుంచి కటింగ్ ప్లేయర్, స్క్రూడ్రైవర్‌తో పాటు ఐరన్ రాడ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన వీరంతా గతంలో పెనుగంచిప్రోలు పరిసర ప్రాంతాలలో జులాయిగా తిరుగుతుంటారని, గోపీ, బాల నేరస్థుడిపై మధిర, బోనకల్, వత్సవాయి పరిసర ప్రాంతాల్లోని దేవాలయాలలో గుడి గంటలు, హుండీల దొంగతనాలకు పాల్పడగా ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై అరెస్టైనట్లు చెప్పారు. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చిన గోపీ మిగతా ఐదుగురు నిందితులతో జతకట్టి ఆగస్టు 20న అచ్చంపేట ఏరియాలోని అటవీ ప్రాంతంలో సత్తెమ్మ తల్లి గుడి తలుపులు పగులకొట్టి సీసీ కెమెరాలను ధ్వంసంచేసి అమ్మవారి వెండి కిరీటాలు, వెండి శఠగోపం, బంగారు ఆభరణాలు, హుండీలను పగులకొట్టి నగదు దొంగిలించారు. తరువాత అదేనెల 28న వేంసూరు మండలం వెంకటాపురంలోని అంకమ్మతల్లి గుడిలో చోరీ చేశారు. హుండీలోని నగదు రూ.1.50లక్షలతో పాటు అచ్చంపేట గుడిలోని అపహరించిన బంగారు సూత్రాలను అమ్మగా వచ్చిన డబ్బులు, వెండి ముద్దలను పెనుగంచిప్రోలులోని ముద్దాయి ఏ1 అయిన గోపీ ఇంట్లో దాచిఉంచారు. విచారణలో నేరం ఒప్పుకున్నందున వేంసూరు ఎస్ఐ సిబ్బందితో కలిసి వెళ్లి నగదు స్వాధీనం చేసుకుని నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా దొంగతనం సమయంలో ఉపయోగించిన రెండు పల్సర్ ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు.

పెనుబల్లిలో ద్విచక్ర వాహనాలు పట్టివేత

పెనుబల్లి మండలం ఉప్పలచెలకలో వీఎం. బంజర్ ఎస్ఐ వెంకటేశం తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేపట్టిన క్రమంలో నంబర్ ప్లేట్‌తో పాటు సరైన ధ్రువపత్రాలు లేని స్కూటీపై వెళ్తున్న షేక్ మౌలాలీ అనే వ్యక్తిని విచారించారు. ఈ క్రమంలో ఆంధ్రాలోని గంపలగూడెం మండలం కనుమూరు గ్రామానికి చెందిన ఇతను కొంతకాలంగా వ్యసనాలకు అలవాటు పడి డబ్బులేనందున దొంగతనాలు చేస్తూ సులభంగా సంపాదిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 17న రాత్రి 11.30ల సమయంలో పాత కారాయిగూడెంలో ఆరుబయట పార్కింగ్ చేసిన ఓ స్కూటీని దొంగతనం చేయగా గతంలో తిరువూరు బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన బండి కూడా దొంగతనం చేశాడు. గంపలగూడెం పోలీస్ స్టేషన్‌లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల ఎదుట ఒప్పుకోగా రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం, వేంసూరు, పెనుబల్లి ఎస్ఐలు వీరప్రసాద్, వెంకటేశంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసులను ఛేదించిన ఎస్ఐలతో పాటు సిబ్బందిని సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు అభినందిస్తూ నగదు అవార్డులను ఏసీపీ అందజేశారు.

పోడు భూముల పట్టాలిప్పిస్తానని మోసం

మణుగూరుటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ పోడు భూములకు పట్టాలిప్పిస్తానని రూ.వేయి చొప్పున తీసుకోని, తమ భూములకు పట్టాలిప్పించకుండా కొండాయి గూడెం గ్రామానికి చెందిన మండారి సతీస్ ఘరానా మోసానికి పాల్పడ్డాడని మండల పరిధిలోని పెద్దిపల్లి గ్రామానికి చెంది న గిరిజనులు ఆరోపించారు. బుధవారం గ్రామస్థులు మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా పోడు భూములను సాగు చేసుకుని జీవిస్తున్న తమ వద్ద వేయి రూపాయాల చొప్పున ముప్పైమంది రైతుల నుంచి డబ్బులు వసూలు చేసి 90 వేలను దండుకున్నాడని ఆరోపించారు. అంతేకాకుండా ఎట్టిజోగయ్య మూడున్నర ఎకరాలు, మడకం పెద్ద సోమయ్యకు చెందిన నాలుగు ఎకరాభూమిని మండారి సతీష్ తన పేరుతో పట్టా చేయించుకున్నాడని తెలిపారు. తమకు జరిగిన అన్యాయం పై పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐటీడీఏ పీవో, కలెక్టర్‌ను కలసి గోడు వెల్లబోసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దిపల్లి గ్రామానికి చెందిన మడివి భీమయ్య, మడకం బాబూరావు, తాటి దేవయ్య, భద్రయ్య, సోడె ఉంగయ్య, ఎట్టి మాసయ్య, పోడియం దేవయ్య, బాడిస జోగయ్య పాల్గొన్నారు.



మోసపోయిన రైతులు జోగయ్య, పెద్ద సోమయ్య

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

నేలకొండపల్లి, అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి) నేలకొండపల్లిలోని కిరాణా షాపుల్లో బుధవారం ఖమ్మం, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించారు. ఓ కుల సంఘం నాయకులు చేసిన ఫిర్యాదు మే రకు నేలకొండపల్లిలోని గెల్లా కిరాణంలో తనిఖీలు చేశారు. పప్పులు, నూనె ప్యాకెట్లు శ్యాంపిల్స్ తీసుకెళ్లారు. శ్యాంపిల్స్‌ను ల్యాబుకు పంపి చెక్ చేయించనున్నట్లు తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

పాల్వంచ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ పట్టణ పరిధిలోని కరకవాగు ప్రాంతంలో కేటీపీఎస్‌కు వెళ్లే రైల్వే ట్రాక్‌పై మృతదేహాన్ని స్థానికులు బుధవారం రాత్రి గుర్తించారు. సమాచారం అందుకున్న పాల్వంచ టౌన్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేసి మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతదేహం రెండు భాగాలుగా విడిపోయి ట్రాక్‌పై పడి ఉండటంతో సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసారా అనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే మృతదేహం ప్రక్కనే పడి ఉన్న సెల్ ఫోన్‌ఫోన్ ఆధారంగా మృతుడు పాల్వంచ గాంధీనగర్ వాసి అని ఆటో డ్రైవర్ యాకూబ్‌పాషా(28) అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

ముదిగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలోని నేషనల్ హైవేపై కారు ఢీకొని ఒక మహిళకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మహారాష్ట్రకు చెందిన జీజేబాయ్ సిండేతోపాటు మరికొంత మంది కుటుంబసభ్యులతో కాలినడకన తిరుపతి వెళ్తున్నారు. ముదిగొండలోని జాతీయ రహదారిపై ఖమ్మం నుంచి కోదాడ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి జీజేబాయ్ సిండేను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహిళను చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

శతాధిక వృద్ధుడి మృతి

జూలూరుపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడు మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో బుధవారం శతావధిక వృద్ధుడు తాటి బొజ్జి (104) అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పలు పార్టీల నాయకులు, గ్రామస్థులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు భార్య లక్ష్మితో పాటు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కట్టలేరులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఎర్రుపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామునూరు గ్రామానికి చెందిన గంతాల వెంకటేశ్వరరావు (30) అనే వ్యక్తి రాజుల దేవరపాడు గ్రామంలో కట్టలేరు నదిలో చేపల వేటకు వెళ్లి మంగళవారం గల్లంతైన విషయం విదితమే. స్థానికుల సమాచారం ప్రకారం విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేష్ గాలిపు చర్యలు చేపట్టారు. కాగా కట్టలేరు దిగువున గల బనిగండ్లపాడు బ్రిడ్జి వద్ద వెంకటేశ్వరరావు మృతదేహం బుధవారం లభ్యమైందని పోస్టుమార్టం నివేదిక కోసం మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు కి భార్య, కుమారుడున్నారు.

నకిలీ ఏటీఎం కార్డుతో రూ.40వేల మోసం

వైరా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ అమాయకుడి అవసరాన్ని ఆసరా చేసుకొని నకిలీ ఏటీఎం కార్డుతో రూ.40వేలు కాజేసిన ఒక మోసగాడి ఉదంతమిది. వైరాలోని ఎస్‌బీఐ ఏటీఎంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. నెలరోజుల కిందట ముసలిమడుగుకు చెందిన ఒక అంగన్‌వాడీ టీచర్‌ను మోసం చేసిన తరహాలోనే ఇప్పుడు కూడా మరో వ్యక్తి వద్ద రూ.40వేలు కాజేసిన మోసగాడు ఒక్కడే అయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కొణిజర్ల మండలంలోని విక్రమ్‌నగర్‌కు చెందిన భూక్యా మదన్ పనుల నిమిత్తం వైరా వచ్చాడు. వైరా ఎస్‌బీఐ ఏటీఎంలోకి వెళ్లి నగదు డ్రా చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. అదే సమయంలో పక్కనే ఉన్న ఒక అపరిచిత వ్యక్తిని నగదు డ్రా చేసేందుకు సాయం కోరాడు. ఇదే అదునుగా భావించి తన దగ్గర ఉన్న నకిలీ ఏటీఎం కార్డుతో అపరిచిత వ్యక్తి నటించి మదన్ ఏటీఎం కార్డును కాజేశాడు. నగదు రావడం లేదని నమ్మించి నకిలీ కార్డును మదన్‌కు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆతర్వాత కొంతసేపటికే రూ.40వేలు నగదు డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్ రావడంతో మదన్ వెంటనే వైరా ఎస్‌బీఐ బ్రాంచ్‌ను సంప్రదించాడు. ఆనగదు బోనకల్ ఏటీఎంలో డ్రా చేసినట్లుగా తేలింది. వెంటనే బాధితుడు వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఎన్టీఆర్ పార్కు వద్ద యోగా కోసం వసతులు కల్పించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై ఎన్టీఆర్ పార్కు వద్ద యోగా కోసం మౌళిక వసతులు కలిపించాలని యోగా నిర్వహకులు శ్రీలతారెడ్డి, ప్రతభారెడ్డి, కవిత, వాణి, మరికొందరు యోగా పరివాహక సభ్యులు బుధవారం వినతిపత్రం అందించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తనయుడు తుమ్మల యగంధర్, మేయర్ పునుకొల్లు నీరజకు వీటిని అందజేశారు. ఎన్టీఆర్ పార్కువద్ద సుమారు 60మంది మహిళలు ప్రతీ రోజు యోగా శిక్షణకు వస్తారని, వర్షం వచ్చిన సమయంలో యోగా శిక్షణకు తీవ్ర ఆటంకం కలుగుతోందని వివరించారు. సమస్య పరిష్కారానికి అక్కడ షెడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	జనక అయితే గనక..
శ్రీనివాస:	వెట్టయాన్
సాయిరాం:	విశ్వం
కేపీఎస్:	రాధేశ్యాం
తిరుమల:	దేవర

నగర సమస్యలపై దృష్టి సారించాలి: సీపీఎం

ఖమ్మంటౌన్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): నగర సమస్యలపై అధికారులు దృష్టి సారించి, పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై. విక్రమ్ డిమాండ్ చేశారు. బుధవారం 44వ డివిజన్ సీపీఎంశాఖ మహాసభ పాత పీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత పార్టీ ఆల్‌ఇండియా సెక్రటరీ దివంగత సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఈమహాసభలో విక్రమ్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన రహదారి బస్‌డిపోరోడ్‌ను 100 అడుగుల రహదారిగా విస్తరించాలన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి సరితాక్లినిక్ వరకు ఎన్నెస్పీ రోడ్‌ను 80అడుగుల రహదారిగా విస్తరించాలని డిమాండ్ చేశారు. నగరంలో పలుచోట్ల రహదారులకు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ మహాసభలో పార్టీ టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్,హుస్సేన్, నాగరాజు, షుకూర్, షఫీ, మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మా కౌన్సిలింగ్

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎఫ్‌సెట్ 2024 బీ ఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు బుధవారంతో కౌన్సిలింగ్ ముగిసింది. ఎస్ఆర్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. మొత్తం 197 మంది విద్యార్థులు స్లాట్ నమోదు చేసుకోని 180మంది కౌన్సిలింగ్‌కు హజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా తెలిపారు.

వందకు పైగా పేరు మోసిన హాస్పిటల్స్.. పేరొందిన విద్యాసంస్థలు .. వీటికి తోడు పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, కమర్షియల్ కాంప్లెక్సులు ఇదీ ఈ ప్రాంత గొప్పతనం. ఇవన్నీ ఉండి కూడా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది 52వ డివిజన్ ప్రాంతం.. సుమారు 15 వేల జనాభా, 5600 ఓట్లు కలిగిన ఆ ప్రాంతం నుంచి ప్రభుత్వానికి పన్నుల రూపేణా భారీగా ఆదాయం వస్తోంది. కానీ అధికారులకు పన్నుల మీద ఉన్న ధ్యాస, అభివృద్ధి మీద లేకపోయింది. రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. డ్రెయినేజీలు పూడిక పేరుకుపోయి మురుగు నిలుస్తోంది. కొద్ది ప్రాంతం వరకే ఉన్న సెంట్రల్ లైటింగ్ ఆ ప్రాంతాన్ని మరింత వెనుకబాటుకు గురి చేస్తున్నాయంటూ స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సరితా క్లీనిక్ సెంటర్‌తో పాటు నూతన బస్టాండ్‌కు వెళ్లే రోడ్లు గుంతలతో అస్తవ్యస్తంగా ఉన్నాయి.



సరితాక్లీనిక్ సెంటర్ వ్యూ



రిలయన్స్‌మార్ట్ కూడలి చిత్రం

పేరు ఘనం.. అభివృద్ధిలో దౌర్భాగ్యం

- అలసత్వంతో 52వ డివిజన్ వెనుకబాటు
- రోడ్లు, డ్రెయినేజీల వ్యవస్థ అంతంత మాత్రమే
- విస్తరణకు నోచుకోని సరితా క్లీనిక్ సెంటర్ రోడ్డు

డివిజన్ విజిట్

ఖమ్మంమార్కెట్, అక్టోబరు23: నగరంలో ప్రధాన రహదారి వైరారోడ్డు నుంచి పాత ఎల్ఐసీ ఆఫీస్ ఎదురు రోడ్డునుంచి రిలయన్స్‌మార్ట్ మీదుగా వయా సరితా క్లీనిక్ సెంటర్, నూతనబస్టాండ్ వరకు ఒక వైపు, మరోవైపు సరితా సెంటర్ నుంచి బస్‌డిపో రోడ్డు జెండాల సెంటర్ వరకు ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధి విషయంలో వెనుకంజలో ఉంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈప్రాంతంలో సరితా క్లీనిక్ సెంటర్‌కి ఒక ప్రాముఖ్యత ఉంది. అప్పట్లో సిటీకి ఆమడ దూరాన ఉన్న ఈ ప్రాంతంలో ఒక దవాఖాన ఉండేది. ఆహాస్పిటల్ పేరే ఈ సెంటర్‌కు పెట్టడం విశేషం. అంతేకాకుండా ఇక్కడి జంక్షన్‌రోడ్డు నిత్యం గుంతల మయంగా ఉంది. డ్రెయినేజీ నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సరితా క్లీనిక్ సెంటర్ రోడ్డును విస్తరించాలని స్థానికులు ఆందోళనలు చేశారు. ఐనప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు.

52వ డివిజన్ ముఖచిత్రం

- ప్రాంతం వైశాల్యం: సుమారు 2.5 కిలోమీటర్లు
- ప్రాంతంలోని ఏరియాలు: లెనిన్‌నగర్, నెహ్రూనగర్, ఎన్ఎస్‌టీ రోడ్డు, సరితాసెంటర్, నాయబ్రాహ్మణకాలనీ, బుర్హాన్‌పురం.
- జనాభా: సుమారు15,000 మంది, ఓటర్లు 5,600 మంది



రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం అత్యంత ఆవశ్యకత

నగరంలో భారీవర్షాలకు వరద వచ్చినపుడు ఇక్కడి ప్రాంతవాసులు ఎక్కువగా ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా డ్రెయినేజీలు, అంతర్గత రోడ్లు అత్యంత అవసరమని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి 2021 నుంచి ఇప్పటి వరకు సుమారు మూడున్నర సంవత్సరాల్లో రూ.1.80కోట్ల సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తయ్యాయి. అనంతరం డివిజన్ అభివృద్ధి పనులకు మున్సిపల్‌ఫండ్ నుంచి రూ.90లక్షలకు టెండర్లు పూర్తైన తరువాత ప్రభుత్వం రద్దు చేసింది. నిధులు విడుదల లేమి తోనే అభివృద్ధి జగరట్లేదని ఇప్పటికైనా నిధులు కేటాయించాలని స్థానికులు పేర్కొంటున్నారు. సరితా సెంటర్ ప్రాంతం నుంచి జెండాల సెంటర్ వరకు, కనకదుర్గ దేవాలయం నుంచి పాతబస్టాండ్‌కు పోయే రోడ్డు విస్తరణ చేపట్టి సెంట్రల్ లైటింగ్ పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధికి సహకరించాలి

కార్పొరేటర్ బుర్రి వెంకటేశ్వర్లు



ఎన్నోసమస్యలతో సతమతమవుతున్నఈ ప్రాంత అభివృధ్ధికి ప్రభుత్వం సహకరించాలి. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడానికి నిధులు విడుదల చేయాలి. డివిజన్‌కు టెండర్లుపూర్తైన విడుదలైన నిధులను సుమారు రూ.90 లక్షలకు పైగా ప్రభుత్వం వెనక్కు తీసుకోవడం బాధాకరం. గత డిసెంబరు నుంచి ఇంతవరకు వార్డు, జనరల్ ఫండ్ రూపాయ కూడా విడుదల చేయలేదు.

తాగునీటి సమస్యను తీర్చాలి

యు. గణేష్, నాయీబ్రాహ్మణ కాలనీ



నగరానికి నడిబొడ్డులో ఉండి కొత్త, పాతబస్టాండ్లు, రైల్వేస్టేషన్‌కు అతి చేరువలో ఉన్నా మాప్రాంతానికి నీళ్లు రెండు రోజులకు ఒకసారి వస్తాయి. అవి కూడా అరకొరగానే విడుదల చేస్తారు. తాగునీరు రోజూ విడుదల చేయాలి. ఖాళీగా ఉన్న ఎన్నెస్పీ స్థలాల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

మౌలిక వసతులు కల్పంచాలి

బి. పుల్లయ్య, సారథీనగర్



52వ డివిజన్ మొత్తం కూడా అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు బాగాలేదు. ఉన్న వాటిల్లో చెత్త పేరుకుపోతే వాటిని తొలగించరు. రాజకీయ నాయకులు, ఈ ప్రాంత పాలకులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి మోడల్ డివిజన్‌గా రూపొందించాలి.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో కేఎండీసీ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు23: ఇటీవల గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగిన 35వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో నగరానికి చెందిన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించారు. కళాశాలలో చదువుతున్న గోపీచంద్ 400 మీటర్లు, 4+ 100 రిలే పోటీలో రెండు రజత పతకాలు సాధించారు. ఎస్‌కే.ఆఫ్రీన్ మిడ్లే రిలేలో కాంస్య పతకం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కోటా అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ రమణారావు, పీడీ ఉపేందర్ పలువురు అధ్యాపకులు అభినందించారు.

అన్నం పౌండేషన్‌కు బియ్యం వితరణ



బియ్యం అందిస్తున్న దాతలు

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు23: (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం పౌండేషన్‌కు మంగళవారం వాసవీక్లబ్ మెంబర్, నగరానికి చెందిన కేసా సత్యం10 క్వింటాల బియ్యాని వితరణగా అందించారు. పౌండేషన్ లోని అనాథలు, మూగ, మాటలు రాని వారి ఆకలి తీర్చేందుకే బియ్యం వితరణ చేసినట్లు సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నం శ్రీనివాసరావు, నాగుల్‌మీరా, క్లబ్ మెంబర్స్ సోమశేషగిరిరావు, హనుమంతరావు, వినోద్‌కుమార్, శ్రీనివాసరావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురిలో ఉన్న మూడు అనాథ మృతదేహాలను బుధవారం అన్నంఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.మృతదేహాల కోసం ఎవ్వరు రానందున ఆసుపత్రి సిబ్బంది, ఓపి పోలీసుల సమక్షంలో స్వాధీనం చేసుకోని నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

దీపావళి పేరుతో వసూళ్లకు పాల్పడితే చర్యలు

- ఏడీసీపీ ప్రసాదరావు

ఖమ్మంక్రైం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఏర్పాటుచేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలు పాటించాలని ఎవరైనా పండగ పేరుతో వసూళ్లుక పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అదనపు డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్ అన్నారు. ఏడీసీపీ ప్రసాదరావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, విద్యుత్‌శాఖ డీఈతో కలిసి దుకాణాలదారులతో పోలీసు కాన్ఫరెన్సు హాల్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. పోలీసు, మునిసిపల్, అగ్నిమాపకశాఖలు, విద్యుత్‌శాఖ, నిర్దేశించినప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాల సమీపంలో ఇసుక, నీరు, రెండు ఫైర్ ఎక్స్‌ట్రిమిషన్లు ఉంచాలన్నారు. అనుమతి లేకుండా బాణాసంచా నిలవచేసినా తయారు చేసినాచట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతిలేకుండా ఎవరైనా బాణసంచా దుకాణాలు నడుపుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.



మాట్లాడుతున్న ఏడీసీపీ నరేష్‌కుమార్

నిబంధనలు

- టపాసులు దుకాణానికి ఆన్‌లైన్‌లో పోలీసు కమిషనర్ కార్యాలయానికి అక్టోబరు 25లోపు దరఖాస్తు చేయాలి
- విద్యుత్, ఫైర్ శాఖతో పాటు మునిసిపల్ శాఖల ఎన్‌వోసీ అనుమతి తప్పనిసరి.
- ఈలైసెన్సులు మూడు రోజులు మాత్రమే.
- ప్రతీ దుకాణం వద్ద 200 లీటర్ల వాటర్ బ్యారల్, నాలుగు ఇసుక బకెట్లు ఏర్పాటుచేసుకోవాలి. ఆరు నీటి బకెట్లను ఏర్పాటు చేసుకోవాలి.
- దుకాణంలో పాత కరెంట్ తీగలు ఉంచరాదు. జాయింట్ కేబుల్స్ వాడవద్దు
- ల్యాబ్‌లు పెట్రోమ్యాక్స్‌ల దుకాణాల వద్ద ఉంచరాదు. జనరేటర్ 15నుంచి 20మీటర్ల దూరంలో ఉంచాలి
- దుకాణంలో 18 ఏళ్ల వారే పనిచేయాలి.

చిన్నపిల్లల సంరక్షణకు అన్ని చర్యలు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగుల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రచే కేంద్రంలో చిన్న పిల్లల సంరక్షణకు అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ముజమ్మిల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే ఉద్యోగులు తమ పిల్లల్ని అప్పగించి నిశ్చింతగా, సమర్థవంతంగా నిర్వహించే విధంగా క్రచే సెంటర్‌లో పిల్లల సంరక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రచే సెంటర్, ఫీడింగ్ రూం, ఉద్యోగుల భోజనగదులను తనిఖీ చేశారు. క్రచేసెంటర్‌లో అవసరమైన ఆటవస్తువులు, సెంటర్‌కు అవసరమైన సామగ్రిని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులు విధుల నిర్వహణకు ఇబ్బంది కలగకుండా వారి చిన్న పిల్లలను కార్యాలయానికి రాగానే సంరక్షణ కేంద్రం క్రచేలో సంరక్షకులకు అప్పగించి ఇంటికి వెళ్లేటప్పుడు తిరిగి తీసుకొని వెళ్లవచ్చఅన్నారు. అనంతరం కలెక్టరేట్ లో ఏర్పాటు చేయు ఫీడింగ్ రూంను పరిశీలించి సూచనలు చేశారు.ఉద్యోగుల భోజన గదిని పరిశీలించారు.



పిల్లల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 955 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టగా, 801 పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయని, 147 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయని, పెండింగ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు పూర్తి చేయాలని అన్నారు.

రాధమ్మకు నివాళులు

ఖమ్మంరూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దతండా గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ చల్లపల్లి శ్రీనివాస్ తల్లి రాధమ్మ దశదిన ఖర్మ బుధవారం పెద్ద తండాలోని చల్లపల్లి ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగేందర్, రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జీ తుంబురు దయాకర్ రెడ్డి, సీపీఎం నాయకులు జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.

సీపీఐ సీనియర్ నాయకుడు మృతి

ఖమ్మంరూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీపీఐ సీనియర్ నాయకుడు మేదరమట్ల వెంకటరామ నర్సయ్య (84) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర నాయకులు మౌలానా, కమలాకర్ నివాళులర్పించారు.

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లపై ఎండల ప్రభావం

- సొంత ట్రాక్టర్లతో ట్రాన్స్ ఫార్మర్లు తరలిస్తున్న రైతులు
- అమలుకాని ఎంఆర్టీ వాహనాల నిబందనలు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి):గతపదిరోజులుఉష్ణోగ్రతలో ఎండలు మండుతున్నాయి. పత్తి, మిర్చి, వరి, ఇతర పంటలు సాగులో ఉండటంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం గణనీయంగా జిల్లాలో పెరిగింది. ఈక్రమంలో వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్లు తరుచూ కాలిపోతున్నాయి. రైతులకు ఆర్థికంగా ఇబ్బంది లేకుండా పైసా వ్యయం జరగకుండా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలోనే ఉచితంగా ట్రాన్స్‌ఫార్మర్ రవాణా జరపాల్సి ఉంది. కానీ ఎంఆర్టీ వాహనాల నిర్వాహణపై పలు విమర్శలు వెలువడుతున్నాయి. రైతులకు వినియోగించాల్సిన వాహనాలను ఇతర అవసరాలకు వాడుతున్నారే విమర్శలు వెలువడుతున్నాయి.



రైతు తీసుకొచ్చిన ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్‌శాఖ వాహనంలోనే తరలించాలి

టీఎస్ఎన్‌పీడీసీఎల్(విద్యుత్)శాఖ నిబంధనల మేరకు రైతుల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే విద్యుత్‌శాఖ వాహనం ద్వారానే ఎంఆర్‌టీకి తరలించాలి. మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తిరిగి రైతు వ్యవసాయ భూమిలో ఉచితంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. కాని ఖమ్మం ఎంఆర్టీ విభాగంపై కొన్నినెలలుగా విమర్శలు వెలువడుతున్నాయి. రైతులే తమ ట్రాక్టర్లు ద్వారా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎంఆర్టీ కేంద్రానికి తరలించుకుంటున్నారు. నిరీక్షించిన తర్వాతనే తిరిగి ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తున్నారని తెలుస్తోంది. రైతులే ట్రాక్టర్లు ద్వారా రవాణా చేయించుకుంటున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. విద్యుత్‌శాఖ వాహనం అందుబాటులో లేకుంటే రైతుల ట్రాక్టర్లుకు కిరాయి విద్యుత్‌శాఖ ద్వారా చెల్లింపులు జరగాలి.

మా దృష్టికి రాలేదు

బద్రుఫవర్, డీఈ, ఎంఆర్టీ

రైతుల వ్యవసాయ భూమి నుంచి విద్యుత్‌శాఖ వాహనాల ద్వారానే ట్రాన్స్‌ఫార్మర్ల రవాణా జరపాల్సి ఉంది. రైతులు తమ ట్రాక్టర్లు ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకొచ్చే విషయం మా దృష్టికి రాలేదు.

ఎక్సైజ్ వాహనాలు వేలం

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రెండోపట్టణ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో అక్రమ రవాణాలో పట్టుబడిన 9 వాహనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. నాల్గు వాహనాలు కొనుగోలు చేశారు. మరో ఐదు వాహనాలు రవాణాశాఖ నిర్ణయించిన ధర రాకపోవటంతో మిగిలిపోయాయి. ఏఈఎస్ వేణుగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో వేలం ముగిసింది. సీఐ చంద్రమోహన్, సిబ్బంది వీరభద్రరావు, సురేందర్‌కుమార్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల ఆర్థిక సాయం

ఖమ్మంక్రైం,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఈ లోకేష్ గుండెపోటుతో ఇటీవల మరణించాడు. ఈనేపథ్యంలో మృతుని కుటుంబసభ్యులకు ఖమ్మం ఉమ్మడి జిల్లాకు చెందిన తోటి బ్యాచ్ పోలీసుసిబ్బంది తమ వంతు సహాయంగా రూ.2లక్షలను సీపీ సునిల్‌దత్ చేతుల మీదుగా తన కార్యాలయంలో బుధవారం అందించారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తాం

- తహసీల్దార్ రాంప్రసాద్

ఖమ్మంరూరల్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయిస్తుందని ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని చింతపల్లిలో ప్రభుత్వ భూమిని బుధవారం తహసీల్దార్, సర్వేయర్, సిబ్బందితో కలిసి సర్వే నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలానికి సంబంధించి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. గ్రామంలో అర్హులైన వారందరికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముత్యం కృష్ణారావు, వీరభద్రం, శేషయ్య, సుధాకర్, రామకృష్ణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేస్తున్న తహసీల్దార్ రాంప్రసాద్..

విస్తరణకు అనుకూలంగా అభివృద్ధి పనులు జరపాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం భవిష్యత్ విస్తర్ణను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కార్యక్రమాలు జరపాలని కమిషనర్ అభిషేక్ ఆగస్త్య సూచించారు. బుధవారం ఖమ్మం నగరంలోని 36,37 డివిజన్లలో నిర్వహిస్తున్న రైల్వే ట్రాక్ విస్తర్ణ సర్వే పనులను పరిశీలించారు. మూడో ట్రాక్ కోసం ఎంత భూమిని సేకరిస్తున్నారో తెలుసుకున్నారు. నూతన డ్రైనేజీ వ్యవస్థల కోసం స్థలాలను పరిశీలించారు. ఈఈ కృష్ణలాల్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ చెత్త వేయటంపై జరిమానా

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి):ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలో బహిరంగంగా చెత్తను వీధుల వెంట వేస్తే సహించబోమని నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య హెచ్చరిస్తున్నారు. బుధవారం 25వ డివిజన్‌లో చెత్తను వెసిన వ్యక్తికి రూ.1వెయ్యి జరిమానా విధించారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్ఎంల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లిలోగా మహిళాప్రాంగణంలో 2024-24కి ఎంపీహెచ్‌డబ్ల్యూ(మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్), ఏఎన్ఎం శిక్షణకు అర్హులైన మహిళా అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం అధికారి వేల్పుల విజేత తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసి, 17సంవత్సరాలు పూర్తైన మహిళా అభ్యర్థులు ఈనెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందించాలని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్లో చేసుకోవాలని, లేని పక్షంలో టేకులపల్లిలోని మహిళా కేంద్రంలో ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు.

నేడు సీపీఎం మండల మహాసభ

నేలకొండపల్లి,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల మహాసభ గురువారం మండల పరిధిలోని మూటాపురంలో జరుగనుంది. మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొంటారని మండల కార్యదర్శి వెంకట్రామిరెడ్డి చెప్పారు.

కరపత్రాలు పంపిణీ

ఖమ్మం సంక్షేమవిభాగం,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): రైతుల పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ఖమ్మం మార్కెట్ ద్వారా అమ్మకాలు జరపటంతో సెస్ రూపంలో మార్కెట్‌కు ఏడాదికి రూ.30 కోట్ల ఆదాయం వస్తుందని, అయినా ప్రభుత్వం రైతులపై దృష్టి సారించి మార్కెట్‌కు వచ్చే రైతులకు కనీస మౌళిక సౌకర్యాలు కల్పించటం లేదని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు విమర్శించారు. సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై ముద్రించిన కరపత్రాలను బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నాయకులు రైతులకు పంపిణీ చేశారు.

ఉద్యోగుల సమారాధన పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి):నవంబరు3న ఖమ్మంలో నిర్వహించనున్న సకలఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేసీ, ఆహ్వాన కమిటీ నాయకులు కోరారు. బుధవారం టీఎన్జీవో కార్యాలయంలో సకల ఉద్యోగుల సమారాధన కరపత్రాలను ఆవిష్కరించారు. జేఏసీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.



బెటాలియన్ ఉద్యోగులకు వ్యాసరచన పోటీలు



సత్తుపల్లిరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఫ్లాగ్ డే-2024 దినోత్సవాల సందర్భంగా బుధవారం మండలంలోని గంగారంలోని 15వ పోలీస్ బెటాలియన్‌లో ఉద్యోగులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతి ఏడాదివలే అక్టోబరు- 21 పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తామని కమాండెంట్ పీజేపీసీ.ఛటర్జీ తెలిపారు.

నష్టపరిహారం, రుణమాఫీ చేయాలి

» తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్

ముదిగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు నష్టపోయినా పంట నష్టం ఇవ్వకుండా, రుణమాఫీ పూర్తిచేయకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి వరప్రసాద్ ఆరోపించారు. ముదిగొండలోని మచ్చా వీరయ్యభవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాతోపాటు మధిర నియోజకవర్గంలో వరదలకు నష్టపోయిన పంట నష్టాన్ని రైతులకు ఇంతవరకు ఇవ్వలేదని, రూ.రెండులక్షల్లోపు రుణమాఫీని కూడా ఈ ప్రభుత్వం పూర్తిచేయలేకపోయిందన్నారు. రుణమాఫీకి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు వంటి ఆంక్షలతోపాటు ఇప్పుడు బ్యాంకర్లు ఆడిట్ చేయలేదనే సాకుతో రుణమాఫీ చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతుల విషయంలో ప్రభుత్వం మాయమాటలు చెప్పి మోసం చేయాలని చూస్తే రైతులు ఊరుకోరన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, రైతుసంఘం మండల అధ్యక్షుడు కందుల భాస్కర్‌రావు, నాయకులు అంజయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేలకొండపల్లి ఏఎంసీ చైర్మన్ సీతారాములు

ముదిగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూలక్ష్మీపురం వద్ద జిన్నింగ్‌మిల్లులో బుధవారం నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల సీతరాములు ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలోనే రైతులు పత్తిని విక్రయించుకోవాలని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ సురేష్, వ్యవసాయశాఖ అధికారిణి రాధ, రైతులు సంజీవరెడ్డి, వంశీ, రంగారావు, అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హైలెవల్ వంతెన నిర్మాణంపై నీలినీడలు

» అసంపూర్తిగా నిర్మాణం

» 2013లోనే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన భట్టి





వైరా నదిపై అసంపూర్తిగా ఉన్న హైలెవల్ వంతెన, వంతెన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

వైరా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామం వద్ద అసంపూర్తిగా ఉన్న హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తిచేసే విషయంలో నీలినీడలు అలుముకున్నాయి. అసంపూర్తిగా ఉన్న ఈ హైలెవల్ వంతెన నిర్మాణాన్ని పూర్తిచేస్తారా..? లేక దీన్ని అసంపూర్తిగానే వదిలేసి వేరేచోట హైలెవల్ వంతెన నిర్మిస్తారా..? అనే దానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, భవనాల నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో ఈ అసంపూర్తిగా ఉన్న వంతెన భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఈ వంతెనను వదిలేసినట్లయితే అనధికారిక సమాచారం మేరకు రూ.మూడుకోట్ల నిధులు వైరా నదిలో పోసినట్లే అవుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

డిప్యూటీ స్పీకర్‌గా నిధులు మంజూరు చేయించిన భట్టి

స్నానాల లక్ష్మీపురానికి చెందిన ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉమ్మడి ఏపీలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలోనే 2013 ప్రాంతంలో నాబార్డు నుంచి ఈ హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఈ వంతెన నిర్మాణానికి సంబంధించిన టెండర్లు ఆహ్వానించటం తదితర ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలోనే 2014లో ఎన్నికలు రావడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం జరిగింది. ఆతర్వాత రెండు,మూడేళ్ల పాటు ఈ హైలెవల్ వంతెన నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. అయినప్పటికీ భట్టి విక్రమార్క తనకున్న పరిచయాలతో హైలెవల్ వంతెన టెండర్లు పిలిచి నిర్మాణం చేపట్టేలా చొరవ తీసుకున్నారు.

రూ.ఏడుకోట్లతో మంత్రి తుమ్మల 2016లో శంకుస్థాపన.

స్నానాల లక్ష్మీపురం-సిరిపురం(కనకగిరి) రహదారిలో స్నానాల లక్ష్మీపురం సమీపంలో వైరా నదిపై 1/8-2/0 దాదాపు 200మీటర్లు హైలెవల్ వంతెన నిర్మాణం రూ.ఏడుకోట్ల నాబార్డు నిధులతో చేపట్టారు. 2016 జూలై 12న అప్పటి ఆర్ అండ్‌బీ, స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఆతర్వాత అనేక అడ్డంకులను అధిగమించి వంతెన నిర్మాణం మొదలైంది. అయితే ఈ నిర్మాణం ఎప్పుడూ సాఫీగా జరుగలేదు. స్నానాల లక్ష్మీపురం వైపు దేవాదాయ స్థలంలో వంతెనకు సంబంధించిన ఒక అబిట్‌మెంట్, నదిలో కొన్ని పిల్లర్లు నిర్మించారు. కొన్ని పిల్లర్ల నిర్మాణం చేపట్టినప్పటికీ భూమి లెవల్‌లోనే నిలిచిపోయాయి. వీటికి సంబంధించి రూ.మూడుకోట్ల వరకు నిధులు ఖర్చుచేశారని అనధికారిక సమాచారం.

ఆలయ అభివృద్ధి, వివిధ పనుల నిర్మాణాలతో వంతెనకు పట్టిన గ్రహణం

డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలిసారి స్నానాల లక్ష్మీపురానికి వచ్చిన భట్టి విక్రమార్క అసంపూర్తి హైలెవల్ నిర్మాణానికి సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ వంతెన నిర్మాణ టెండర్ ఒప్పంద గడువు ముగియడంతో నాబార్డుకు చెందిన నిధులు కొన్ని మురిగిపోయాయి. ఒక దశలో ఈ నిధులకు సంబంధించిన అకౌంట్ కూడా మూతపడిందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే భట్టి విక్రమార్క వంతెన నిర్మాణంపై దృష్టిసారించారు. ఇదే తరుణంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయఅభివృద్ధికి రూ.3.20కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆలయానికి చెందిన స్థలాల్లో వసతి భవనం, ఇతర నిర్మాణాలు చేపట్టనుండటంతో ఈ వంతెనపై పునరాలోచనలో పడ్డారు. వంతెన ఆలయానికి చెందిన స్థలం మధ్య నుంచి వెళ్తుండటంతో దీని నిర్మాణం జరుగుతున్నట్లయితే ఆలయ అభివృద్ధి నిర్మాణాలకు తద్వారా భక్తులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని అందువలన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాలని దేవాదాయశాఖ అధికారులు ఆర్‌అండ్‌బీశాఖ అధికారులను కోరారు. ఇదే విషయం భట్టి దృష్టికి కూడా వెళ్లడంతో ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపై సర్వే చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించడంతో ఆశాఖ ఎస్ఈ హేమలత, ఈఈ యుగంధర్, డీఈఈ రమేష్ ఇతర అధికారులు పరిశీలించి పలురకాల సర్వేలను వారంరోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసంపూర్తి వంతెన నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయనే చర్చ నడుస్తోంది.

నేడు విద్యుత్ సరఫరా బంద్

వైరా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వైరా సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వైరా పట్టణ పరిధిలో గురువారం ఉదయం 7నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.సుందర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని సూచించారు.

పశువైద్యశిబిరం

ముదిగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమర్రి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. రైతులు పశువుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఎల్‌డీఏ వైరా ఈవో కిషోర్ వివరించారు. పశువులకు సంబంధించిన మందులను రైతులకు పంపిణీ చేశారు. పశువైద్యాధికారులు అశోక్, రమేష్, గోపాలమిత్రలు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.రెండులక్షల వితరణ

తల్లాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కేశ్వాపురంలోని సీతారామాంజనేయస్వామి ప్రధాన ఆలయం అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐ చావా అమర్‌చంద్, స్వాతి దంపతులు ముందుకొచ్చారు. ప్రధాన ఆలయం మండపం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటుకు రూ.రెండులక్షలు ఆర్థికసాయం అందించారు. అమర్‌చంద్ తల్లిదండ్రులు చావా నర్సింహారావు, జయమ్మ దంపతులను బుధవారం ఆలయకమిటీ అధ్యక్షుడు కట్టా రమాకాంత్ ఆధ్వర్యంలో సన్మానించారు. అమర్‌చంద్ దంపతులకు తాజా మాజీ సర్పంచ్ వనిగండ్ల అలేఖ్య అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వనిగండ్ల వెంకటేశ్వరరావు, మన్నేపల్లి రామారావు, చావా నాగేశ్వరరావు, కట్టా కృష్ణమూర్తి, చావా విష్ణు, సాదం రమేష్, అర్చకుడు శ్రీనివాసరాజన్ పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణి

కారేపల్లి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వార మండలానికి వచ్చిన ఉచిత చేప పిల్లలను ఆయా పంచాయతీలకు చెందిన మత్స్యకారులకు జిల్లా అధికారులు మంగళవారం పంపిణీచేశారు. వాటిని బుధవారం పలుగ్రామాలల్లోనే చెరువులలో, కుంటలలో వదులుతున్నారు. మండలానికి మొత్తం 5లక్షల69వేల చేపపిల్లలు వచ్చాయి.

నష్ట పరిహారం అవకతవకలపై కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

బోనకల్, అక్టోబరు 23: పంట నష్ట పరిహారం విషయంలో అర్హులను గుర్తించకుండా విస్మరించారని, అనర్హులకు లబ్ధి చేకుర్చారని మండలంలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన రైతులు బుధవారం ఖమ్మంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సాగు భూముల కన్నా ఎక్కువ విస్తీర్ణంలో పంటలు వేసినట్లు జాబితాను పంపించి పంట నష్ట పరిహారంలో వ్యవసాయాధికారులు అక్రమాలకు పాల్పడ్డారని, వారి పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతులు పారా వెంకట మోహన్‌రావు, బుంగ రాములు, తోటకూర వెంకటేశ్వరావు, మలాది లింగయ్య, పదిలం నర్సింహరావు, మరీదు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

అధికారుల పక్షపాతం వల్లే రైతులకు అన్యాయం జరిగింది: సీపీఐ

అధికారుల పక్షపాత వైఖరి వలనే అసలు రైతులకు నష్టం జరిగిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తూము రోషన్ కుమార్, ఆకేన పవన్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన వధూవరులతో తిరుమలను దర్శించుకున్న సండ్ర



తిరుమల వద్ద సండ్ర కుటుంబసభ్యులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నూతన వధూవరులతో కలసి బుధవారం దర్శించుకున్నారు. ఇటీవల ఆయన కుమారుడు భార్గవ్, సాయిచిద్విత‌ల వివాహం ఘనంగా నిర్వహించగా వారితో పాటు ఆయన సతీమణి మహాలక్ష్మీ, మరో కుమారుడు తేజలతో కలసి స్వామివారిని సండ్ర దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించుకున్న సండ్రను ఆలయ కమిటీ సభ్యులు శేషవస్త్రాలతో సత్కరించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితుల వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

దివ్యాంగుల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన

వైరా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం బహుజన అభ్యుదయ సేవసమితి ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ దివ్యాంగుల హక్కులు, సంక్షేమ పథకాలను వివరించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రిజర్వేషన్ ప్రకారం దివ్యాంగులకు అమలవుతున్న పథకాలు తదితర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆదూరి ఆనంద్, మణి, మోదుగు వినోద్‌కుమార్, మహేందర్‌నాథ్, చిల్లిముంతల వెంకటేశ్వరరావు, కువ్వారపు విజయరాజు, ప్రేమకుమారి, బుడిగ సునీత, వరపర్ల రవికుమార్, వెంకట్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ముద్వా రూ.50వేల సాయం



శివభార్గవిని సన్మానిస్తున్న టీజీబీడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు

సత్తుపల్లి, అక్టోబర్23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నీట్‌లో ర్యాంక్ సాధించిన పట్టణంలోని గుడిపాడుకు చెందిన రాజిని ప్రసాద్, నాగమణి దంపతుల కుమార్తె శివభార్గవికి టీజీబీడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. పేద కుటుంబంలో పుట్టి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన శివభార్గవిని అభినందిస్తూ ఆయన క్యాంప్ కార్యాలయంలో మువ్వా ఘనంగా సన్మానించారు. మువ్వాకు శివభార్గవి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గుడిపాడు వాసులు పాల్గొన్నారు.

చెరుకు మద్దతు ధర టన్నుకు రూ.3,200 అందిస్తాం

కాకతీయ షుగర్ ఫాక్టరీ ప్లాంట్ ఇంజనీర్ రఘునాథబాబు

వేంసూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతులకు చెరుకు మద్దతు ధర టన్నుకు రూ. 3,200 అందిస్తామని ఫాక్టరీ ప్లాంట్ ఇంజనీర్ కె రఘునాథబాబు చెప్పారు. బుధవారం వేంసూరు మండలంలోని రామన్నపాలెంలో ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు రైతుల సమావేశం నిర్వహించారు. ఆయన ప్రసంగిస్తూ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు చేసిన ప్రాంతాల్లో క్రషింగ్ సీజన్‌లో కూలీల కొరతను అధిక మించేందుకు చెరుకు నరికే యంత్రాలను వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు. చెరుకు సాగులో దిగుబడులు పెంచుకొని అదనపు ఆదాయం సమాకుర్చుకోవాలని సూచించారు. యంత్రాల సహాయంతో చెరుకు నరికే విధంగా సాగులో 54 అంగుళాలు దూరంలో నాటితే ఉచితంగా 2 టన్నుల విత్తన కర్ర ఇవ్వటం జరుగుతుందన్నారు. ఫ్యాక్టరీ తరుపున పలు రకాల రుణాలును అందిస్తున్నట్లు వివరించారు. ఈ సంవత్సరం క్రషింగ్ సీజన్‌లో కూలీలు చెరుకు నరికే ధర రూ.800 గా నిర్ణయించామన్నారు. చెరుకు సాగులో రైతులు అన్ని విధాలుగా సహకరించాలన్నారు. కేన్ అడ్వైజర్ నరిసింహామూర్తి , ఫీల్డ్ ఆఫీసర్ గోవిందరావు పాల్గొన్నారు.

26న ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం

మధిరరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు శీలం గోపాల్‌రెడ్డి, కర్నాటి రాంమోహన్‌రావు తెలిపారు. అలాగే అదేరోజు సంఘం భవన నూతన ప్రారంభోత్సవ కార్యక్రమం కూడా నిర్వహిస్తామన్నారు.

గిరిజనుల సమస్యలపై గవర్నర్ ప్రత్యేక చొరవ చూపాలి



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

ఏన్కూరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిల్లా పర్యటన సందర్భంగా గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి సమస్యల పరిష్కారానికి చొరవ చూపపాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం కోరారు. బుధవారం ఏన్కూరులో సంఘం సమావేశం వాంకుడోత్ హరిరాం అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ ఏజెన్సీ మండలాల్లో భూ సమస్య తీవ్రంగా ఉందని పక్కాగృహాలు, ఇళ్లస్థలాలు లేని గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నవంబరు 5న ఖమ్మంలో జరిగే గిరిజన సమ్మేళనం జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో భూక్యా లచ్చునాయక్, బండ్ల చిన్నజోగయ్య బానోతు మధు, లకావత్ శ్రీనివాస్‌నాయక్, రాములు, బీమా తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలు..

పట్టించుకోండి..

తల్లాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తల్లాడ-భద్రాచలం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో అడుగడుగునా గుంతలతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. తల్లాడ మండలం అన్నారుగూడెం నుంచి నర్సింహారావుపేట వరకు ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారిలో అడుగుకొక గుంత ఉంది. ప్రధాన రహదారిలో గుంతల వల్ల కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. వర్షాలకు నీరు నిలిచిలోతు ఉండటం వల్ల గుంతలు సరిగా కన్పించకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదాల భారీనపడుతున్నారు. ఈనెల 20న గుంతలను తప్పించబోయి అన్నారుగూడెం వద్ద కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వరుసగా సోమ, మంగళవారాల్లో కూడా ద్విచక్రవాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారిలోని అన్నారుగూడెం నుంచి నర్సింహారావుపేట వరకు గుంతలు పూడ్చేందుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారిలో గుంత

ఉపాధ్యాయులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి



ఉపాధ్యాయులకు ఓటు హక్కు నమోదు ఫారాలను అందిస్తున్న నాగేశ్వరరావు

ఏన్కూరు/తల్లాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరావు కోరారు. బుధవారం మండలంలోని మూలపోచారం, తిమ్మరావుపేట, బురదరాఘవాపురం, ఏన్కూరు బాలుర, బాలికల పాఠశాలలు, కేజీబీవీ, గురుకుల విద్యాలయాన్ని సందర్శించి ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఫారాలను అందించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బి.రామచందర్, శ్రీదేవి, కోశాధికారి ఎం.నాగేశ్వరరావు మండల సీనియర్ నాయకులు ఎం.పుల్లయ్య, రాఘవరావు, శంకర్‌రావు, పుల్లయ్య, నరసింహారావు, శ్యామ్‌కుమార్, నాగరాజు, శోభన్, శ్యామలమ్మ, చందరరావు, సింగ్యా, రమేష్, నాగేశ్వరరావు, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదుపై ప్రచారం

తల్లాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ ఓటునమోదు గురించి ప్రచారం నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను యూటీఎఫ్ నాయకులు సందర్శించి ఉపాధ్యాయులకు ఓటుహక్కు నమోదుపై అవగాహన కల్పించారు. యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.శ్రీకాంత్, రంజాన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు లాల్‌సయ్యద్, తాళ్లూరి శ్రీనివాసరావు, మురళీకృష్ణ, ఝాన్సీ లక్ష్మీ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: మునిసిపల్ ఛైర్మన్ మహేష్

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వార్డులలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మునిసిపల్ ఛైర్మన్ కూసంపూడి మహేష్ తెలిపారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో 43వ సాధారణ సమావేశం నిర్వహించారు. పారిశుధ్యంతో పాటు నీటి సరఫరా విభాగాలలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా వీధి కుక్కలు, పందులు, కోతుల స్వైరవిహారంపై ప్రజల నుంచి వినతులు వస్తుండగా అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పట్టణ అభివృద్ధి నిమిత్తం పలు అంశాలపై ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కమీషనర్ మందా రవి బాబు, కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యు రహదారికి మరమ్మతులు ప్రారంభం



గుంతలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కొణిజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. గుంతలకు మరమ్మతులు ప్రారంభించారు. మంగళవారం ఇదే రహదారిపై 'ఆంధ్రజ్యోతి'లో మృత్యు రహదారి, ప్రాణా లు పోతున్న పట్టించుకోరా..! కథనం ప్రచురించడం జరిగింది. పత్రికల్లో కథనాలు రావడం, ప్రజల ఇబ్బందులు తెలుసుకున్న అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ప్రధానరహదారిపై ఉన్న పెద్దపెద్దగుంతలను పల్లిపాడు, కొణిజర్ల మధ్య మరమ్మతులు చేస్తున్నారు. అయితే రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలనే కాకుండ చిన్న చిన్న గుంతలకు కూడ మరమ్మతులు చేయాలని, ద్విచక్రవాహనదారులు కోరుతున్నారు. భారీ గుంతలను పూడ్చుతుండటంతో వాహనదారులు ఊపిరిపీల్చుకుంటున్నారు.